ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
పెద్దపల్లి
జిల్లా వార్తలు
3★
సోమవారం 24 జూన్ 2024



'రుణ మాఫీ'పై కాంగ్రెస్ శ్రేణుల సంబరాలు 6లో..

నష్టపరిహారంపై నిర్దిష్ట ఒప్పందం జరగాలి 6లో..

పెట్టుబడి సాయం అందేదెన్నడో?



- మరింత ఆలస్యంకానున్న 'రైతు భరోసా'
- విధివిధానాల ఖరారుకు మంత్రివర్గ ఉప సంఘం
- జూలై 15లోగా నివేదిక ఇవ్వనున్న ఉప సంఘం
- రుణ మాఫీపైనే ప్రభుత్వం దృష్టి

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

జిల్లాలో రైతులు పెట్టుబడి సాయం కోసం ఎదురుచూస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో అమలుచేసిన రైతు బంధు పథకానికి బదులు రైతు భరోసా పథకాన్ని అమలుచేస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ఇందుకు గాను విధివిధానాలను ఖరారు చేసేందుకు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క నేతృత్వంలో మంత్రివర్గ ఉపసంఘాన్ని వేయడంతో పెట్టుబడి సాయం ఆలస్యంగానే అందనున్నది. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా తాము అధికారంలోకి వస్తే ఆరు గ్యారంటీ పథకాలను అమలుచేస్తామని కాంగ్రెస్ పార్టీ ప్రకటించింది. అందులో భాగంగా రైతు భరోసా పథకాన్ని అమలు చేస్తామని పేర్కొన్నారు. ఈ పథకం ద్వారా ఒక్కో ఎకరానికి రెండు సీజన్లకు కలిపి 15 వేల రూపాయలు, కౌలు రైతులకు కూడా అంతే మొత్తాన్ని, రైతు కూలీలకు 12 వేల రూపాయల చొప్పున అందజేస్తామని ప్రకటించింది. అంతకుముందుకు ఇదే పథకాన్ని బీఆర్ఎస్ ప్రభుత్వం రైతుబంధు పథకాన్ని అమలు చేసింది. పట్టా కలిగిన వారందరికి సీజన్‌కు 5 వేల చొప్పున రెండు సీజన్లకు 10 వేల రూపాయల పెట్టుబడి సాయాన్ని అందజేసింది. ఇందులో కౌలు రైతులకు ఎలాంటి సాయాన్ని అందజేయ లేదు. ఈ పథకం అమలు చేసేందుకు అప్పటి ప్రభుత్వం ధరణి పోర్టల్‌ను అనుసంధానం చేసుకుని నేరుగా రైతుల ఖాతాల్లో డబ్బులను జమ చేసింది. ఈ క్రమంలో సాగులో ఉన్న, సాగులో లేని భూములు, రహదారులు, ప్రాజెక్టుల కింద సేకరించిన భూములకు, నాలా మార్పిడి చేయకుండా వెలసిన రియల్ ఎస్టేట్ వెంచర్లకు, భూస్వాములకు, ప్రభుత్వ ఉద్యోగులకు సైతం ఎలాంటి విధి విధానాలు రూపొందించకుండానే అప్పటి ప్రభుత్వం రైతుబంధు పథకాన్ని అమలుచేసింది. ఈ పథకం ద్వారా జిల్లాలో లక్షా 46 వేల మంది రైతులకు 136 కోట్ల రూపాయలను చెల్లిస్తున్నది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతుబంధు పథకాన్ని సవరించి తాము ప్రకటించిన రైతు భరోసా పథకాన్ని అమలుచేయాలని భావించింది. గడిచిన యాసంగి సీజన్‌లో పాత విధానంలోనే రైతులకు పెట్టుబడి సాయాన్ని అందించింది.

● ప్రారంభమైన వానాకాలం..

వానాకాలం సీజన్ ప్రారంభం కావడంతో రైతులు పెట్టుబడి సాయం కోసం ఎదురుచూస్తున్నారు. కొత్త పథకాన్ని అమలుచేస్తారా, పాత పథకం ప్రకారమే పెట్టుబడి సొమ్మును ఖాతాల్లో జమచేస్తారా అని రైతులు చర్చించుకుంటున్నారు. దానికంటే ముందు పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా ఆగస్టు 15వ తేదీ వరకు రైతులకు 2 లక్షల రూపాయల వరకు రుణ మాఫీ పథకాన్ని అమలు చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. ఈనెల 21న నిర్వహించిన మంత్రి మండలి సమావేశంలో ముందుగా రుణ మాఫీ పథకాన్ని అమలుచేయాలని నిర్ణయించారు. రైతు భరోసా పథకాన్ని అమలు చేసేందుకు రాష్ట్ర ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క నేతృత్వంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు సభ్యులుగా ఉప సంఘాన్ని నియమించారు. ఈ ఉప సంఘం రైతు సంఘాలు, రైతు కూలీ సంఘాలు, రాజకీయ పార్టీల నాయకులు, వివిధ వర్గాల నుంచి సలహాలు, సూచనలు స్వీకరించి జూలై 15లోపు నివేదిక అందజేయాల్సి ఉంటుంది. ఆ నివేదికను వచ్చే శాసనసభ బడ్జెట్ సమావేశాల్లో ప్రవేశపెట్టి ఎమ్మెల్యేల అభిప్రాయాలను స్వీకరించి విధివిధానాలను ఖరారు చేయనున్నది. ఈ పథకం అమలుచేసేందుకు 10 ఎకరాల వరకు పరిమితం చేసే సూచనలు కనబడుతున్నాయి. రహదారులు, కొండలు, గుట్టలు, బంచరాయి భూములు, సాగుకు యోగ్యం కానీ భూములను, ప్రజాప్రయోజనాల కోసం ప్రభుత్వం సేకరించిన భూములను, ప్రభుత్వ ఉద్యోగుల భూములను పథకం నుంచి తొలగించనున్నారు. అలాగే కౌలు రైతులు కౌలుకు చేస్తున్న భూముల యజమానులకు గాకుండా రైతు భరోసా కింద పెట్టుబడి సాయాన్ని సదరు కౌలు రైతులకు కొంత, పట్టాదారులకు కొంత సాయాన్ని అందించే అవకాశాలు ఉన్నాయి. విధివిధానాలు ఖరారు అయిన తర్వాతనే ఈ సీజన్ నుంచి గానీ వచ్చే యాసంగి సీజన్ నుంచి గానీ ప్రభుత్వం పెట్టుబడి సాయాన్ని అందించే అవకాశాలున్నాయి.

సుల్తానాబాద్ పట్టణ సమగ్ర అభివృద్ధికి కృషి

- ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయరమణారావు

సుల్తానాబాద్, జూన్ 23: సుల్తానాబాద్ ప్రాంత అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నామని ఎమ్మెల్యే విజయరమణారావు అన్నారు. సుల్తానాబాద్ రిక్రియేషన్ క్లబ్‌లో ఆదివారం జనరల్ బాడీ సమావేశాన్ని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో ఎమ్మెల్యేను క్లబ్ ఉపాధ్యక్షులు సీనియర్ న్యాయవాది క్రిష్ణమూర్తి, ప్రధానకార్యదర్శి ఆకుల రామేశ్వర్‌రెడ్డి, పలువురు ప్రతినిదులు ఆయనను సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సుల్తానాబాద్‌లో చదువుకున్న తాను ఈప్రాంత అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ చూపుతానని అన్నారు. గత పాలకుల హయాంలో సుల్తానాబాద్ పట్ల సవతి తల్లి ప్రేమ చూపారన్నారు. గతంలో సుల్తానాబాద్ తాలూకా కేంద్రంగా ఉండేదని, నియోజకవర్గంలో సుల్తానాబాద్ ప్రాంతానికి ప్రత్యేక గుర్తింపు ఉందని, ప్రజల సహకారం, మేదావుల ప్రోత్సాహంతో పట్టణాన్ని సమగ్రంగా అభివృద్ధి చేయడానికి కృషి చేస్తానన్నారు. ముఖ్యంగా సుల్తానాబాద్ పట్టణం వ్యాపార, వ్యవసాయపరంగా అభివృద్ధి చెందుతోందని, పెరుగుతున్న జనాభాకు తగ్గట్లుగా పట్టణాన్ని అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానన్నారు. ఇందులో భాగంగా ప్రధాన రోడ్లను వెడల్పు చేసే కార్యక్రమం కొనసాగుతుందని, దీనివల్ల పట్టణం బాగుంటుందన్నారు. అలాగే రిక్రియేషన్ క్లబ్ అభివృద్ధికి కూడా సహకరిస్తానన్నారు. కార్యక్రమంలో మినుపాల ప్రకాష్‌రావు, అంతటి అన్నయ్యగౌడ్, దామోదర్‌రావు, జగన్, రాజేంద్ర ప్రసాద్, ముస్త్యాల రవీందర్, ఖాలిక్, రమేష్, సురేష్, సాయిరి మహేందర్, కదారి అశోక్‌రావు, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

శ్యామ్ ప్రసాద్ ముఖర్జీకి ఘన నివాళులు



శ్యామ్ ప్రసాద్ ముఖర్జీకి నివాళులర్పిస్తున్న కందుల సంధ్యారాణి, నాయకులు

గోదావరిఖని, జూన్ 23: జాతీయవాద భావజాల రాజకీయ ఆద్యుడు శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ అని బీజేపీ ఇన్‌చార్జ్ కందుల సంధ్యారాణి అన్నారు. బీజేపీ తలపెట్టిన విజయ్‌దివస్ కార్యక్రమంలో భాగంగా తిలక్‌నగర మండల అధ్యక్షుడు గోపగోని నవీన్‌గౌడ్, జనగామ మండల అధ్యక్షుడు గుండబోయిన భూమాన్న ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమానికి రామగుండం బీజేపీ ఇన్‌చార్జి కందుల సంధ్యారాణి హాజరై శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కందుల సంధ్యారాణి మాట్లాడుతూ జాతీయ సమైకృత కోసం పట్టుదలతో పనిచేసి దేశంలో బలమైన రాజకీయ ప్రత్యామ్నాయ మార్గం చూపించిన మహోన్నత వ్యక్తి డాక్టర్ శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ అన్నారు. ఆయన ఆలోచనలే మెరుగు దిద్దుకొని భారతీయ జన సంఘానికి, ఆ తర్వాత భారతీయ జనతా పార్టీకి కూడా మూల భూత సైద్ధాంతిక ఆధార అయ్యిందన్నారు. ఏక్ దేశ్ మే దో ప్రధాన్, దో నిషాన్, దో విధాన్ నహి చలేగా అని నినదించి జమ్మూకాశ్మీర్ 370 ఆర్టికల్ విముక్తి కోసం దేశవ్యాప్తంగా ఉద్యమాన్ని నిర్వహించారన్నారు. ఈ ఉద్యమంలో భాగంగానే జమ్మూకాశ్మీర్‌లో అరెస్టు అయి నిర్బంధంలోనే మరణించారన్నారు. దేశ ప్రజల విముక్తి కోసం, పూర్తి స్వాతంత్ర్యం కోసం ప్రాణాలను సైతం లెక్కచేయని శ్యామప్రసాద్‌ముఖర్జీ జీవితం అందరికీ ఆదరణీయం, ఆదర్శవంతం అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు కొండపర్తి సంజీవ్, కోమల్ల మహేష్, చుక్కల రాములు, కొమ్మ స్వామి, జక్కుల ప్రవీణ్, శివరామకృష్ణ, పెండ్యాం సత్యనారాయణ, విశ్వనాథ్, పంగ రవి, ఆకాష్ గౌడ్, రెవెళ్లి పద్మ, తడిగొండ నర్సయ్య, వకుళాభరణం కిషోర్, భాస్కర్, తోకల రాజు, చెన్నూరి రమేష్, గోపగోని రాకేష్, రమేష్, రాజా, అంకార్, భరత్, పృథ్వీరాజ్, కాదాసి శంకర్, ఇరుగురాల శివకుమార్, సురేష్, మిరియాల రాజు, కుమార్, శ్రీకాంత్ శ్రీనివాస్, రవి తదితరులు పాలొన్నారు.

సుల్తానాబాద్‌లో..

సుల్తానాబాద్, జూన్ 23: భారతీయ జన సంఘ్ వ్యవస్థాపకులు శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ వర్ధంతిని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. ముఖర్జీ చిత్రపటం వద్ద పూలు సమర్పించి బలిదాన్ దివస్ కార్యక్రమం నిర్వహించారు.

ఈ సందర్భంగా ముఖర్జీ సేవల ను కొనియాడారు. ఆయన 1951లో జన సంఘ్‌ను ఏర్పాటు చేశారని, ఆధునిక హిందువాద రాజకీయ పార్టీని స్థాపించిన నేతగా స్థానం సంపాదించారని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు కూకట్ల నాగరాజు, ప్రధాన కార్యదర్శి గజబీంకార్ పవన్, బీజేవైఎం జిల్లా కార్యదర్శి బుర్ర సతీష్‌గౌడ్, ఈశ్వర్, శంకరయ్య, లక్ష్మణ్, లచ్చయ్య, నాగరాజు, శివకృష్ణ, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

పత్తిపాకలో ఘనంగా పోచమ్మ బోనాలు



పత్తిపాకలో పోచమ్మ బోనాలతో ఊరేగింపుగా వెళుతున్న మహిళలు

ధర్మారం, జూన్ 23: ధర్మారం మండలం పత్తిపాక గ్రామంలో ఆదివారం ఘనంగా పోచమ్మ బోనాల పండగ నిర్వహించారు. గ్రామంలో ప్రతి ఇంటినుంచి మహిళలు బోనాలను పోచమ్మకు సమర్పించడానికి భారీ ఊరేగింపుతో డప్పు చప్పుళ్లతో బయలుదేరారు. ఊరంతా ఒక్కసారిగా బోనాలతో కదిలివెళ్లారు. ఆలయం వద్ద మహిళలు పోచమ్మకు బోనాలతో మొక్కులు సమర్పించారు. అదేవిధంగా ధర్మారంలో పోచమ్మకు మొక్కులు చెల్లించారు. రోడ్లపై వాహనాదారులు రోడ్డు మైసమ్మలు మొక్కలు చెల్లించారు.

కనగర్తిలో పెద్దమ్మ తల్లి బోనాలు



బోనాలతో ఊరేగింపుగా వెళుతున్న మహిళలు

పెద్దపల్లి రూరల్, జూన్ 23: మండలంలోని కనగర్తి కాపులపల్లి గ్రామాల్లో ముదిరాజ్ కులస్తుల ఆధ్వర్యంలో ఆదివారం పెద్దమ్మ తల్లి బోనాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఇరు గ్రామాల నుంచి ముదిరాజ్ కులస్తులు ప్రతీ ఇంటికి ఒక బోనం చొప్పున మహిళలు బోనం ఎత్తకుని డప్పు చప్పుళ్లనడుమ ఊరేగింపుగా పెద్దమ్మ తల్లిని దర్శించకున్నారు. ఉత్సవాల్లో ముదిరాజ్ కులస్తులు ఎల్లంకి రామస్వామి, తాడవేని కుమారస్వామి, చొప్పరి కనుకయ్య, కొలిపాక కనుకయ్య, ఎల్లంకి రాయమల్లు, స్వామి, కిష్టయ్య, పిటల స్వామి, శంకరయ్య ఎల్లంకి, శంకర్ పాల్గొన్నారు.

గ్రామీణ ప్రాంతాల్లో సేవలందించాలి..

- లయన్స్ క్లబ్ 320 జి ఉపగవర్నర్ కోదండరాం



లయన్స్ క్లబ్ అధ్యక్షుడిగా రవీందర్‌ను, ధరణి అధ్యక్షురాలుగా మంజులను ప్రకటిస్తున్న ఉప గవర్నర్ కోదండరాం

ధర్మారం, జూన్ 23: గ్రామీణ ప్రాంతాల్లో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సేవలు చేసి గుర్తింపు పొందాలని క్లబ్ 320జి ఉప గవర్నర్ సింహారాజు కోదండరాం అన్నారు. ఆదివారం ధర్మారంలో నూతన లయన్స్ కమిటీ ప్రమాణస్వీకారోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఉమ్మడి జిల్లాలో లయన్స్ క్లబ్‌లను విస్తరించి సేవలు అందిస్తున్నట్టు తెలిపారు. క్లబ్ ఆధ్వర్యంలో 12వేల మందికి సేవలందించి ఉచిత కంటి పరీక్షలు చేయించినట్టు తెలిపారు. కరీంనగర్‌లో రూ.2కోట్లతో సీటీస్కాన్, డయాగ్నోస్టిక్ సెంటర్‌లను ఏర్పాటు చేసి సేవలందిస్తున్నట్లు ఆయన చెప్పారు. ఎంపీపీ ముత్యాల కరుణశ్రీ, డీసీఎస్ శ్రీనివాసరావు, డీసీటీ ఆనంద్, ప్రోగ్రాం చైర్‌పర్సన్ సామ ఎల్లారెడ్డి, రీజియన్ చైర్‌పర్సన్ తన్నీరు రాజేందర్, జోన్ చైర్‌పర్సన్ డాక్టర్ కె. శ్రీనివాస్, రీజియన్ సెక్రటరీ మునీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ నూతన కమిటీ అధ్యక్షుడిగా రవీందర్

ధర్మారం లయన్స్ క్లబ్, ధరణి క్లబ్ నూతన కమిటీలుగా ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు క్లబ్ 320జి ఉపగవర్నర్ కోదండరాం ప్రకటించారు. అధ్యక్షుడిగా తలమక్కి రవీందర్ శెట్టి, ప్రధానకార్యదర్శిగా ఎండి ముజాహిద్, కోశాధికారిగా కట్ట రమేష్, ఉపాధ్యక్షులుగా ఇప్ప మల్లేశం, బొట్ల లక్ష్మీనర్సయ్యలతో పలువు కార్యవర్గ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నికైట్టు ఆయన ప్రకటించారు. అదేవిధంగా లయన్స్ క్లబ్ ధరణి అధ్యక్షురాలిగా కె. మంజుల, సెక్రెటరీగా తన్నీరు పద్మ, కోశాధికారిగా నాడెం శ్రీవిద్య, ఉపాధ్యక్షురాలుగా చింతపండు జలజలతోపాటు కార్యవర్గ సభ్యులు ఎన్నికైనట్టు ప్రకటించారు. అనంతరం వారందరితో ప్రమాణ స్వీకారం చేయించి సన్మానించారు.

రామగుండం అభివృద్ధికి భారీగా నిధులు

- టీయూఎఫ్ఐడీసీ, అమృత్, డీఎంఎఫ్‌టీ నిధులతో పనులు - గోదావరి జలాల కాలుష్య నివారణకు ఎస్‌టీపీలు

- సింగరేణి, జెన్‌కో స్థలాల్లోని కట్టడాల క్రమబద్ధీకరణ - ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

గోదావరిఖని, జూన్ 23: రామగుండం నియోజకవర్గాన్ని ప్రణాళికబద్ధంగా అభివృద్ధి చేస్తున్నామని, ఈ మేరకు ప్రభుత్వం నుంచి భారీగానిధులు విడుదలయ్యాయని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్ ఠాకూర్ పేర్కొన్నారు. ఆదివారం స్థానిక క్యాంపు కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో పాలకుల నిర్లక్ష్యం వల్ల రామగుండం అభివృద్ధికి నోచుకోలేదని, కేసీఆర్, కేటీఆర్‌లు నిధులు మంజూరు ప్రకటించారే తప్ప విడుదల చేయలేదన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి శ్రీధర్‌బాబు సహకారంతో రూ.100కోట్ల టీయూఎఫ్ఐడీ నుంచి నిధులు విడుదల చేయించామని, ఇందుకు సంబంధించి టెండర్లు కూడా పిలిచారన్నారు. రూ.30కోట్లతో గోదావరిఖనిలోని వ్యాపార కేంద్రమైన లక్ష్మీనగర్‌లో అభివృద్ధి పనులు చేపడుతున్నామని, 50డివిజన్లలో ఇంటర్నల్ రోడ్లకు రూ.20కోట్లు, ప్రధాన రహదారుల నిర్మాణానికి రూ.10కోట్లు కేటాయించామన్నారు. వరదల నివారణకు పారిశుద్య చర్యలు మెరుగుపర్చడంలో భాగంగా పెద్ద నాలాలను ఆధునీకరించేందుకు రూ.10కోట్లు కేటాయించామన్నారు. రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో పూర్తిస్థాయిలో సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేస్తామన్నారు. ఇందు కోసం రూ.10కోట్లు కేటాయించామన్నారు. రూ.5కోట్లు మంచి నీటి సరఫరాకు కేటాయించినట్టు ఎమ్మెల్యే తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో అభివృద్ధికి సరైన ప్రణాళికలు వేయలేదని, కూడళ్లను విస్తరించకుండా నిర్మాణాలు జరిపారన్నారు. రూ.2కోట్లతో కీలకమైన ప్రాంతాల్లో జంక్షన్లను అభివృద్ధి చేస్తామన్నారు. పండ్ల మార్కెట్‌కు గతంలో కొబ్బరికాయలు కొట్టారని, సింగరేణి నుంచి స్థలం తీసుకోకుండానే ఈ పనులు చేశారన్నారు. రూ.4 కోట్లతో పండ్ల మార్కెట్‌ను అభివృద్ధి చేస్తామన్నారు. రూ.250కోట్ల అమృత్ నిధులతో సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్లు, డ్రైనేజీ లైన్లు నిర్మించనున్నామన్నారు. రామగుండం, పాములపేట, మల్కాపూర్, జనగామ, ఫైవింక్లయిన్‌కాలనీ ప్రాంతాల్లో ఎస్‌టీపీలు నిర్మించి మురుగు నీరు గోదావరిలో కలువకుండా చర్యలు చేపడుతామన్నారు. ఇందుకు సంబంధించి టెండర్ల ప్రక్రియ పూర్తయ్యిందని, త్వరలోనే పనులు ప్రారంభమవుతాయన్నారు. ఈ ప్రాంత అభివృద్ధిలో సింగరేణి, ఎన్‌టీపీసీలను భాగస్వామ్యం చేస్తామన్నారు. రూ.13కోట్లతో సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ఏర్పాటు జరుగుతుందని, గుండె జబ్బుల చికిత్స, సర్జరీలు కూడా ఇక్కడే చేసేలా చర్యలు చేపడుతామన్నారు. ఈ ఆసుపత్రిలో సింగరేణి కార్మికులకే కాకుండా ఇతర పౌరులకు కూడా సేవలందుతాయన్నారు. సింగరేణి కాలనీల్లో రూ.5కోట్లతో అంతర్గత రహదారుల నిర్మాణం కూడా జరుగుతుందన్నారు. రూ.22కోట్లతో ర్యాపిడ్ ఫిల్టర్ స్కీమ్ పురోగతిలో ఉందని, 10నెలల్లో అందుబాటులో ఉంటుందన్నారు. రూ.22కోట్ల డీఎంఎఫ్‌టీ నిధులు, రూ.10కోట్ల స్పెషల్ ఫండ్ వెచ్చించనున్నట్టు ఎమ్మెల్యే తెలిపారు. సింగరేణి, ఎన్‌టీపీసీ సంస్థలకు అవసరమయ్యే విడి భాగాలు, పనిముట్ల సరఫరాకు అనుబంధ పరిశ్రమలను ప్రోత్సహిస్తామన్నారు. ఎన్‌టీపీసీ బూడిదతో బ్రిక్స్ ప్లాంట్ ఏర్పాటుకు ముందుకువస్తే అంతర్గాం సమీపంలో స్థలాలు కూడా ఇప్పించనున్నట్టు ఎమ్మెల్యే తెలిపారు. ఎన్‌టీపీసీ అదనపు యూనిట్ల విద్యుత్ కొనుగోలు భారమవుతుందని, రాష్ట్ర ప్రభుత్వం ఆసక్తి కనబర్చడం లేదని, ఈ ప్రాంత అభివృద్ధి దృష్ట్యా, ఇక్కడి ప్రజల ఉపాధి దృష్ట్యా త్వరలోనే యూనిట్ల నిర్మాణానికి క్లియరెన్స్ ఇప్పించనున్నామన్నారు. రామగుండం పట్టణంలో ఈఎస్ఐ ఆసుపత్రి నిర్మాణం జరుగనున్నదని, ఈ మేరకు టెండర్ల ప్రక్రియ కూడా పూర్తయ్యిందన్నారు. సింగరేణి, జెన్‌కో స్థలాల్లో ఇండ్లు నిర్మించుకున్న వారికి త్వరలోనే పట్టాలు ఇవ్వనున్నామని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో ఈ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. సికింద్రాబాద్ - కాగజ్‌నగర్ రూట్‌లో తరచూ రైళ్లను రద్దు చేయడంపై రైల్వే అధికారుల దృష్టికి తీసుకెళ్లామని, ఎంపీ ద్వారా పార్లమెంట్‌లో ప్రస్తావిస్తామన్నారు. విలేకరుల సమావేశంలో నగర కాంగ్రెస్ అధ్యక్షుడు బొంతల రాజేష్, కార్పొరేటర్లు మహంకాళి స్వామి, కొలిపాక సుజాత, బాల రాజ్‌కుమార్, దాతు శ్రీనివాస్, సీనియర్ నాయకులు కాల్వ లింగస్వామి, మారెల్లి రాజిరెడ్డి, దీటి బాలరాజు, బొమ్మక రాజేష్, పెండ్యాల మహేష్, తిప్పారపు శ్రీనివాస్, నాజీమోద్దీన్, కొటం సతీష్ పాల్గొన్నారు.

యథేచ్ఛగా మట్టి తవ్వకాలు


- రంగనాయకుల కుంటకు పొంచి ఉన్న ప్రమాదం



గుంపుల రంగనాయకుల కుంటలో మట్టిని తవ్వుతున్న ఎక్స్‌కవేటర్

ఓదెల, జూన్ 23 : మండలంలోని గుంపుల రంగనాయకుల కుంటలో మట్టి తవ్వకాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. గుంపులలో మానేరు వాగుపై చెక్‌డ్యాం నిర్మాణంలో భాగంగా కరకట్టల నిర్మాణం పేరుతో సంబంధిత కాంట్రాక్టర్ తన ఇష్టానుసారంగా మట్టిని తవ్వి తరలించుకెళుతున్నారు. ఇరిగేషన్ శాఖ నుంచి 80వేల క్యూబిక్ మీటర్ల మేరకు మట్టిని తవ్వి తరలించేందుకు అనుమతి పొందినట్లు తెలుస్తోంది. కానీ దీని ప్రకారం 6,666లారీ ట్రిప్పులను తీసుకెళ్లాల్సి ఉంది. కొద్దిరోజుల నుంచి జేసీబీలతో గుంపులలోని రంగనాయకుల కుంట నుంచి ప్రభుత్వం అనుమతి పొందిన దానికంటే మూడింతలుగా నల్లమట్టిని లోతు తవ్వి తరలిస్తున్నారని గ్రామస్తులు తెలిపారు. అనుమతి పొందిన మేరకు రూ.23.99 లక్షల 760 చెల్లించగా, దీనివిలువ కంటే ఎక్కువగా రూ.కోటికి పైగా విలువ చేసే మట్టిని కరకట్టల నిర్మాణం పేరుతో నల్లమట్టిని తరలిస్తున్నప్పటికీ అదే కుంటలో అనుమతి కంటే అధిక లోతు మట్టిని తీసుకెళుతున్నారని తెలిపారు. నల్లమట్టి అయిపోయినప్పటికీ మొరం మట్టిని సైతం విడిచి పెట్టకుండా అక్రమంగా తరలిస్తున్నారని గ్రామస్తులు తెలిపారు. సంబంధిత అధికారుల పర్యవేక్షణ కరువైందని, కుంటల్లో అధిక లోతు మట్టి తవ్వకాల వల్ల ప్రస్తుతం గుంపుల రంగనాయకుల కుంట అతి ప్రమాదకంగా మారిందని గ్రామస్తులు, యువకులు తెలిపారు. దీంతో ప్రధాన రహదారి పక్కన్నే ఈ కుంట ఉండటం వల్ల ఇక నుంచి తరచుగా ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయని మాజీ ప్రజాప్రతినిధులు, యువకులు తెలిపారు. ఇక వర్షాకాలం ఉధృతం అయితే ఈ కుంట నిండిపోయి ప్రమాదానికి మరింత చేరువ అవుతుందని, చెక్‌డ్యాం పేరుతో నల్లమట్టిని, మొరం సైతం తవ్వుకెళ్లి ఇటుక బట్టీల యజమానులకు, కొందరి రైతులకు విక్రయిస్తున్నట్లు గ్రామస్తులు పేర్కొంటున్నారు.

ఈ తవ్వకాల విషయంపై ఇరిగేషన్ అధికారులను ఫోన్ ద్వారా సంప్రదించగా ఏమాత్రం స్పందించలేదు. వెంటనే చెరువు వద్ద తనిఖీలు నిర్వహించి అనుమతి కంటే ఎక్కువ తవ్వకాలు ఉన్నట్లయితే వాహనాలను సీజ్ చేసి, సంబంధిత కాంట్రాక్టర్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.











ఘనంగా మహాలక్ష్మి అమ్మవారి బోనాలు



బోనాలతో వెళ్తున్న మహిళలు

కోరుట్ల రూరల్, జూన్ 23: మండలంలోని చిన్నమెట్‌పల్లిలో మహాలక్ష్మి అమ్మవారి బోనాల పండగ ఆదివారం ఘనంగా జరిగింది. ఉదయం నుంచి భక్తులు అమ్మవారిని దర్శించుకునేందుకు బారులు తీరారు. గ్రామశివారులో ఉన్న అమ్మవారి ఆలయం దాకా డప్పు చప్పుళ్లతో ఊరేగింపుగా వెళ్లారు. అనంతరం అమ్మవారికి బోనాలు నైవేద్యంగా సమర్పించారు. పోతారాజులు చేసిన విన్యాసాలు ఆద్యంతం ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో గ్రామపెద్దలు, మహిళలు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.







మల్లన్న సన్నిధిలో భక్తుల సందడి

- ఒకే రోజు రూ.4 లక్షల ఆదాయం

- వైద్య సౌకర్యం లేక భక్తులకు ఇబ్బందులు



పట్నాలు వేస్తున్న ఒగ్గు పూజారులు

ఓదెల, జూన్ 23: పెద్దపల్లి జిల్లా ఓదెల మండల కేంద్రంలోని భ్రమరాంబ మల్లికార్జునస్వామి సన్నిధిలో ఆదివారం భక్తులు సందడి నెలకొంది. వివిధ జిల్లాల నుంచి దాదాపు పదివేల మందికి పైగా వచ్చిన భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. ఒకేరోజు ఆలయానికి రూ.నాలుగు లక్షల మేరకు ఆదాయం సమకూరిందని అధికారుల అంచనా. భక్తులు స్వామిని దర్శించుకునేందుకు మూడు గంటల సమయం పట్టింది. ఆరుద్ర కార్తెలో వర్షాలు పుంజుకునే అవకాశం ఉన్నందున ఆలయంలో భక్తుల రద్దీ పెరుగుతోంది. ఈ మేరకు ఆలయానికి అధిక సంఖ్యలో తరలివచ్చిన భక్తులు ఒగ్గు పూజారులతో పట్నాలు వేయించారు. అలాగే కోడే మొక్కులు, బోనాలు, సమర్పించారు. అనంతరం మదనపోచమ్మ, బంగారు పోచమ్మ, వీరభద్రస్వామి రామాలయాన్ని భక్తులు దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ప్రతి ఆదివారం, బుధవారం జాతరలో వైద్యం సౌకర్యం ఏర్పాటు చేయాల్సిన సిబ్బంది కనబడకపోవడంతో భక్తులు ఇబ్బందులకు గురయ్యారు. పరకాల మండలానికి చెందిన కొందరు భక్తులు తీవ్రమైన ఉక్కపోతతో అస్వస్థకు గురికాగా చికిత్స కోసం దేవాలయంలోకి వచ్చారు. అక్కడ వైద్య సిబ్బంది లేకపోయేసరికి ఆటోలో పెగడపల్లిలోని ఒక ప్రైవేటు వైద్యుడి వద్ద చికిత్స పొందారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందున జాతరలో నీరు కలుషితం అయ్యే పరిస్థితి ఉన్నందున వైద్య సేవలు అందేలా చూడాలని భక్తులు కోరుతున్నారు.

గీత కార్మికుడికి తీవ్ర గాయాలు

ఇల్లందకుంట, జూన్ 23: మండలంలోని మల్యాల గ్రామానికి చెందిన బొమ్మ తిరుపతి అనే గీత కార్మికుడు చెట్టు మీద నుంచి కింద పడగా తీవ్ర గాయాల య్యాయి. తోటి కార్మికులు తెలిపిన వివరాల ప్రకారం.. తిరుపతి ఆదివారం వృత్తిలో భాగంగా తాటిచెట్టు ఎక్కి కల్లు తీస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు జారి కిందపడిపోయాడు. తోటి కార్మికులు వెంటనే జమ్మికుంటలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం వరంగల్ ఆస్పత్రికి తరలించారు. కాగా తిరుపతి నడుముకు తీవ్ర గాయాలయ్యాయి.తిరుపతికి ఆర్థిక సహాయం అందజేయాలని గీత కార్మిక సంఘం నాయకులు శ్రీనివాస్, దేవేందర్ విజ్ఞప్తి చేశారు.

తాగునీటి సమస్యపై ఆందోళన

గంభీరావుపేట, జూన్ 23: గంభీరావుపేట మండల కేంద్రంలోని డబుల్ బెడ్ రూం ఇళ్లలో తాగునీటి సమస్యపై కాలనీవాసులు ఆదివారం ఆందోళన చేపట్టారు. నాలుగు రోజులుగా మిషన్ భగీరథ నీరు రావడం లేదని, దీంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వాపోయారు. నీటి సమస్యను సంబంధిత అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఇప్పటికైనా స్పందించాలని, సమస్యను వెంటనే పరిష్కరించాలని కోరారు.

పోకిరీల బెడద

- ద్విచక్రవాహనాలపై త్రిబుల్ రైడింగ్

- కళాశాలలు, బస్టాండ్‌లే ప్రధాన అడ్డాలు



వాహనాల సైలెన్సర్లు ధ్వంసం చేస్తున్న పోలీసులు

సిరిసిల్ల క్రైం, జూన్ 23: జిల్లాలో పోకిరీల బెడద మితిమీరిపోయింది. పట్టణంలోని కళాశాలలు, బస్టాండ్‌లే ప్రధాన అడ్డాలుగా చేసుకొని యువకులు ద్విచక్రవాహనాలపై చక్కర్లు కొడుతున్నారు. యువకులు ఒక్కో బైక్‌పై త్రిబుల్ రైడింగ్ చేస్తూ ఇబ్బందులపాలు చేస్తున్నారు. జిల్లాలో స్కూల్స్, కళాశాలలు ప్రారంభమయ్యాయి. దీంతో బస్టాండ్‌లు, ఇళ్లనుంచి కళాశాలలకు వెళ్లే యువతులను ఆటపట్టిస్తున్నారు. యువకుల ఆకతాయి చేష్టలకు కళాశాలకు వెళ్లే విద్యార్థినులు, యువతులు ఆందోళన చెందుతున్నారు. పోకిరీల ఆగడాలపై షీటీమ్ నిఘా వేసినప్పటికీ పోకిరీల ఆగడాలు ఆగడంలేదు. షీటీమ్ బృందాలు కౌన్సెలింగ్ ఇస్తున్నా పరిస్థితిలో మార్పు రావడం లేదు.

● ద్విచక్రవాహనాలపై చక్కర్లు

జిల్లాలోని సిరిసిల్ల, వేములవాడ పట్టణంలో పోకిరీలు ద్విచక్రవాహనాలపై చక్కర్లు కొడుతూ ఆందోళనకు గురి చేస్తున్నారు. యువకుల చేతిలో ద్విచక్రవాహనంపై ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. కళాశాలలకు వెళ్లే విద్యార్థినులు, యువతులను ఇబ్బందుల పాలు చేస్తున్నారు. విద్యార్థినుల ఇళ్ల ముందు చక్కర్లు కొడుతూ హారన్‌లు మోగిస్తూ విసిగిస్తున్నారు. బైక్‌లకు ఎక్కువ శబ్దం వచ్చే హారన్‌లు నిబంధనలకు విరుద్ధంగా బిగిస్తున్నారు. ద్విచక్రవాహనాలు నడిపే యువకులకు ఎలాంటి లైసెన్స్ ఉండదు. మరోవైపు ద్విచక్రవాహనంపై ముగ్గురు రైడింగ్ చేస్తూ ఆందోళన కలిగిస్తున్నారు. కాగా షీటీమ్‌లు పట్టుకొని కౌన్సెలింగ్ ఇచ్చినా పోకిరీల బెడద తప్పడం లేదు. రాజన్న సిరిసిల్ల జిల్లాలోని సిరిసిల్ల, వేములవాడ పట్టణాల్లో ఏడాదిలో వందలాదిమంది యువకులకు షీటీమ్ బృందాలు కౌన్సెలింగ్ ఇచ్చారు. గతంలో సిరిసిల్ల పట్టణంలోని కొందరు యువకులు స్నేహితులుగా ఏర్పడి ఇంట్లో నుంచి డబ్బులు తీసుకెళ్లి ద్విచక్రవాహనాలపై చక్కర్లు కొడుతూ జల్సాలు చేసి కటకటాలపాలైన విషయం తెలిసిందే. మరోవైపు సిరిసిల్ల పట్టణంలోని పాతబస్టాండ్, కళాశాలలు, తదితర రద్దీ ప్రదేశాల్లో బైక్‌పై చక్కర్లు కొడుతూ ఆకతాయి చేష్టలకు పాల్పడిన అనేకమంది యువకులను షీటీమ్స్ అదుపులోకి తీసుకొని కౌన్సెలింగ్ ఇచ్చి వదిలేశారు.

● షీటీమ్‌ల నిఘా..

సిరిసిల్ల, వేములవాడ పట్టణంలో పోకిరీలపై షీటీమ్‌లు నిఘా వేసినా ఆగడాలు తప్పడంలేదు. జిల్లాలో రెండు షీటీమ్‌లు పనిచేస్తున్నాయి. సిరిసిల్ల, వేములవాడలో ఒక్కో షీటీమ్‌లు ఎప్పటికప్పుడు నిఘాను పెంచారు. ప్రధానంగా బస్టాండ్‌లు, కూడళ్లు, కళాశాలల వద్ద నిఘా వేస్తున్నారు. మే నెలలో ముగ్గురు పోకిరీలపై కేసు నమోదు చేసి మరో నలగురిపై పెట్టి కేసులు పెట్టారు. అధిక శబ్దం చేస్తున్న 86 ద్విచక్రవాహనాలను గుర్తించి వాటి సైలెన్సర్‌లను రోడ్ రోలర్ చేత ధ్వంసం చేశారు. మహిళలను, విద్యార్థినులను వేధిస్తున్న వారిని గుర్తించి తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సెలింగ్ ఇచ్చి పంపించేశారు. ఎక్కడైనా పోకిరీలు యువతులను ఇబ్బందుల పాలు చేస్తే డయల్ 100కు లేదా 8712656425కు సమాచం అందిస్తే వెంటనే షీటీమ్‌లు రంగంలోకి దిగి రక్షణ కల్పిస్తాయి.

నిఘా తీవ్రం : అఖిల్ మహాజన్, ఎస్పీ



జిల్లాలో పోకిరీల ఆగడాలపై నిఘా తీవ్రం చేశాం.. మహిళలు, యువతులను వేధింపులకు గురించేస్తే కఠిన చర్యలు తప్పవు. మహిళల భద్రతకు అనేక కార్యక్రమాలు చేపడుతున్నాం. అనుమానాస్పద వ్యక్తులు, పోకిరీలు కనిపిస్తే 8712656425, 100కు సమాచారం ఇవ్వాలి. వెంటనే చర్యలు తీసుకుంటాం.

సాయికిరణ్ హత్య కేసులో నిందితుల అరెస్టు

మానకొండూర్, జూన్ 23: మానకొండూర్‌కు చెందిన సాయికిరణ్ హత్య కేసులో నలుగురు నిందితుల మానకొండూర్ పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. సాయికిరణ్‌కు హత్య చేసిన బట్టి శ్రీనివాస్, బట్టి సునీత, తమ్మిడి గంగారాం, భీమంకర్ శ్యాంరావును అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. జడ్జి ఆదేశాలతో నలుగురిని 14 రోజుల రిమాండ్‌కు కరీంనగర్ జిల్లా జైలుకు తరలించారు. మానకొండూర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.... సాయికిరణ్ కొద్దికాలం కిందట సిద్ధిపేట జిల్లా మిడిదొడ్డి మండలం కొండాపూర్‌లో కోళ్లఫాంలో కూలీగా పనిచేస్తూ భార్యపిల్లలతో కలిసిఉండేవాడు. అదేఫాంలో పని చేస్తున్న బట్టి శ్రీనివాస్, బట్టి సునీతలతో సాయికిరణ్‌కు స్నేహం ఏర్పడింది. సునీతతో అసభ్యకరంగా ప్రవర్తించడంతో వారి మధ్య గొడవ జరగడంతో అక్కడ పనిమానేసిన సాయి కిరణ్ మానకొండూర్‌కు వచ్చి ఒక సామిల్‌లో పనిచేస్తుండేవాడు. ఏప్రిల్ 18న సాయికిరణ్ కొండాపూర్ ఫాంకు వెళ్ళి అక్కడ శ్రీనివాస్, సునీతతో మళ్లీ గొడవపడ్డాడు. దీంతో శ్రీనివాస్, అతని భార్య సునీత అక్కడి నుంచి వారి స్వగ్రామం ఆసిఫాబాద్ జిల్లా దహెగాం మండలం బారెగూడెంకు వెళ్లిపోయారు. అయినప్పటికీ సాయికిరణ్ వారికి ఫోన్ చేసి వేధించసాగాడు. దీంతో విసిగిపోయిన బట్టి శ్రీనివాస్, సునీత దంపతులు ఎలాగైనా సాయికిరణ్‌ను అడ్డుతొలగించుకునేందుకు పథకం రచించారు. ఈ మేరకు ఏప్రిల్ 19న సునీతతో సాయికిరణ్‌కు ఫోన్ చేయించి వారి స్వగ్రామానికి పిలిపించుకున్నారు. సాయికిరణ్ రాగానే అతడిపై కర్రలతో దాడి చేసి హత్య చేశారు. అనంతరం సాయికిరణ్ మృతదేహాన్ని పాడుబడిన వ్యవసాయబావిలో పడేశారు. ఏప్రిల్ 18న ఇంటి నుంచి బయటకు వెళ్లిన సాయికిరణ్ ఇంటికి రాలేదని అతడి భార్య మానకొండూర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి రెండు నెలలపాటు తీవ్రంగా గాలించి నిందితులను పట్టుకున్నారు.

ఇసుక డంపులు స్వాధీనం



పాషిగామలో ఇసుక డంపులు సీజ్ చేస్తున్న అధికారులు

వెల్గటూర్, జూన్ 23: మండలంలోని స్తంభంపల్లి, పాషిగామలో నిల్వ ఉంచిన అక్రమ ఇసుక డంపులను ఆదివారం అధికారులు దాడులు నిర్వహించి స్వాధీనం చేసుకున్నారు. వేసవిలో ఎండల ప్రతాపానికి గోదావరిలో నీటి మట్టం పడిపోవడంతో ఇసుక తేలింది. గోదావరి ఇసుక కొందరి అక్రమార్కుల కన్ను పడింది. కొందరు ట్రాక్టర్ యజమానులు దొరికిన కాడికి దోచుకుందామని గోదావరిలో ఇసుకను తోడి శివారు ప్రాంతాల్లో నిల్వ చేశారు. మరికొందరు రూ.2 వేల నుంచి రూ.2400ల వరకు ఇతరులకు అమ్ముకున్నారు. కొన్ని రోజులుగా ఈ తంతు కొనసాగుతుండగా కలెక్టర్ ఆదేశాల మేరకు రెవెన్యూ, మైనింగ్, పోలీసు అధికారులు అక్రమ ఇసుక డంపులపై దాడులు నిర్వహించారు. స్తంభంపల్లి శివా రులో ఎల్లమ్మ గుడి ప్రాంతంలో ఏడు చోట్ల నిలువ ఉంచిన 700 ట్రాక్టర్ ట్రిప్పుల ఇసుకను పట్టుకున్నారు. పాషిగామ శివారులో సుమారు 169 ట్రాక్టర్ ట్రిప్పుల అక్రమ ఇసుకను గుర్తించి పంచనామా నిర్వహించి స్వాధీనం చేసుకున్నారు. కార్యక్రమంలో మైనింగ్ ఏడీ జయసింగ్, తహశీల్దార్ శేఖర్, ఎస్సై ఉమా సాగర్, ఆర్ఐ రాజేశ్వరి, రాయల్టీ ఇన్‌స్పెక్టర్ తిరుపతి రావు, డీటీ గంగాధర్, జూనియర్ అసి స్టెంట్ సుదర్శన్, తహశీల్దార్ కార్యాలయ సిబ్బంది, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

మట్టి టిప్పర్లు పట్టివేత



పట్టుకున్న మట్టి టిప్పర్లు

ఎల్లారెడ్డిపేట, జూన్ 23: అనుమతి లేకుండా అక్రమంగా తరలిస్తున్న రెండు మట్టి టిప్పర్లను ఎల్లారెడ్డిపేట తహసీల్దార్ కార్యాలయం ఎదుట పట్టుకున్నట్లు తహసీల్దార్ రామచంద్రం ఆదివారం తెలిపారు. మట్టిని రవాణా చేస్తున్నారనే సమాచారం మే రకు తనిఖీ చేశామని, తరలింపునకు ప్రభుత్వ అను మతి లేదని తేలిందని పేర్కొన్నారు. తమను చూసిన వాహన డ్రైవర్లు పారిపోయారని, వాహనాలను కార్యాలయానికి తరలించి సీజ్ చేశామన్నారు. అను మతి లేకుండా ఇసుక, మట్టిని తరలిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

బైక్ అదుపు తప్పి రైతుకు గాయాలు

ఎల్లారెడ్డిపేట, జూన్ 23: ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని రైతు చర్చ మండలి సమీపంలో ఆదివారం ద్విచక్రవాహనం అదుపు తప్పిన సంఘటనలో స్థానిక రైతు బాధ రాజు తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు 108 వాహనంలో మండల కేంద్రంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. రాజు తన బైక్‌పై ఎల్లమ్మ ఆలయం వైపునకు వెళ్తుండగా వాహనం అదుపు తప్పింది.

పేకాట స్థావరంపై దాడులు

రుద్రంగి, జూన్ 23: మండల కేంద్రం శివారులోని అటవీ ప్రాంతంలో పేకాట ఆడుతున్నారనే సమాచారం మేరకు ఆ పేకాట స్థావరంపై శనివారం రాత్రి దాడి చేసినట్లు ఎస్సై అశోక్ తెలిపారు. రుద్రంగి, చందుర్తి మండలాల శివారు లోని అటవీ ప్రాంతంలో పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో దాడి చేశామని, ఐదుగురిని పట్టుకున్నామని, మరో ఐదుగురు పారిపోయారని పేర్కొన్నారు. రూ.20 వేల నగదు స్వాధీనం చేసుకున్నట్లు, పది మందిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

బైక్‌పై వచ్చి.. చెప్పులు దొంగిలించి..



సీసీ పుటేజీకి చిక్కిన అనుమానితుడు

ఓదెల, జూన్ 23: ఆర్థికంగా చితి కి పోయి గానీ, జల్సాలకు అలవాటు పడి గానీ కొందరు దొంగలు చోరీ లకు పాల్పడి డబ్బు, ఆభరణాలు దోచుకెళ్తారు. కానీ ఒక గుర్తుతెలి యని దొంగ స్టైల్‌గా ఖరీదైన బైక్ మీద ఓదెల మల్లికా ర్జునస్వామి ఆలయానికి తరచూ వచ్చి ఒకే వ్యక్తి కి సంబంధించిన మూడు జతల చెప్పులను ఎత్తుకెళ్లా డు. ఇదంతా సీసీ పుటేజీకి చిక్కింది. ఆలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న ముద్దసాని కుమారస్వామికి చెందిన మూడు జతల పాద రక్షలను ఇప్పటివరకు ఎత్తుకెళ్లాడు. కేవలం ఒకే వ్యక్తికి చెందిన మూడు జతలు చెప్పులను ఎత్తుకెళ్లడం సీసీ పుటేజీలో రికార్డు అయింది. చోరీకి పాల్పడిన వ్యక్తి ఎవరు? పాద రక్షలను ఏం చేస్తున్నాడనేది? తెలియాల్సి ఉంది.

ఘనంగా హ్యాండ్‌బాల్ దినోత్సవం

కరీంనగర్ స్పోర్ట్స్, జూన్ 23: ఉమ్మడి జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రపంచ హ్యాండ్‌బాల్ దినోత్సవం, ప్రపంచ ఒలింపిక్ దినోత్స వాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని లయోల విద్యాసంస్థల మైదానంలో నిర్వహించిన ఈ వేడుకల్లో ఉమ్మడి కరీంనగర్ జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బసర వేని లక్ష్మణ్ ముఖ్య అతిథిగా హాజరై వేడుకలను ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడాకారులు జాతీయ స్థాయిలో రాణించి ప్రభుత్వ ఉద్యోగాలు సాధించాలన్నారు. కార్యక్ర మంలో హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి నమిలికొండ ప్రభాకర్, హ్యాండ్‌బాల్ కోచ్ మూల వెంకటేష్, నాగుల శ్రీనివాస్, జె విజయ్, శ్రీకాంత్, అమర్, శివాజి, రాజు తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి సంస్థను కాపాడుకుందాం

- మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్



మాట్లాడుతున్న మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్

సుభాష్‌నగర్, జూన్ 23: సింగరేణి బొగ్గు గనులను వేలం వేయకుండా సంస్థను కాపాడుకుందామని కార్మికులకు మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ పిలుపునిచ్చారు. సింగరేణిని వేలం వేస్తే చూస్తూ ఊర్కొనేది లేదని ఆయన ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఆదివారం కరీంనగర్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వాలు సింగరేణిని ప్రైవేటీకరణ చేయడానికి అడుగులు వేస్తున్నాయని విమర్శించారు. సింగరేణిని కాపాడాల్సిన బాధ్యత కేంద్ర బొగ్గు గనులశాఖ మంత్రిగా కిషన్‌రెడ్డిపై ఉందన్నారు. గతంలో నష్టాల్లో ఉన్న సంస్థ కార్మికులు, యాజమాన్యం సమష్టి కృషితో నష్టాల నుంచి గట్టెక్కిందన్నారు. లాభాల్లో ఉన్న ఈ సంస్థను ప్రైవేటీకరణ చేయడం ఏమిటని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ప్రశ్నించారు. ప్రధాని మోదీ, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి దేశంలోని అనేక బొగ్గు గనులతో పాటు సింగరేణి బొగ్గు గనులను కూడా వేలం వేయడానికి నిర్ణయం తీసుకోవడం దురదృష్టకరమని కొప్పుల ఈశ్వర్ అన్నారు. సింగరేణిని బొంద పెట్టడానికే ప్రధాని మోదీ కిషన్‌రెడ్డికి బొగ్గు శాఖ మంత్రి పదవి ఇచ్చినట్లుందని విమర్శించారు. బొగ్గు బావుల వేలంలో సింగరేణికి సంబంధించిన శ్రావణపల్లి కోల్‌బ్లాక్ కూడా ఉందని తెలిపారు. ఇది ఖచ్చితంగా రాష్ట్ర ప్రభుత్వం యొక్క దిగజారుడుతనానికి నిద ర్శనమని, ఇదంతా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసికట్టుగా చేస్తున్న కుట్ర అని ఆరోపించారు. ఎనిమిది మంది బీజేపీ ఎంపీలు గెలిస్తే తెలంగాణ ప్రజలకు ఇచ్చే తొలి రిటర్న్ గిఫ్ట్ ఇదేనా అని ప్రశ్నించారు. బొగ్గు గనుల వేలాన్ని అభ్యంతరం చెప్పాల్సిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రధాని మోదీతని ఆహ్వానిస్తు న్నారని ఆరోపించారు. ఆనాడు ప్రతిపక్షంలో ఉన్న రేవంత్ రెడ్డి వేలాన్ని వ్యతిరేకిస్తూ మోదీకి లేఖ రాశారని ఈ సందర్భంగా కొప్పుల గుర్తు చేశారు. ఇప్పుడు ముఖ్యమంత్రి హోదాలో రేవంత్‌రెడ్డి ప్రధానికి ఎందుకు లేఖ రాయడం లేదని ప్రశ్నించారు. వేలం కార్యక్రమంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పాల్గొనబోతున్నారని ఆయన ఆరోపించారు. వేలంపై సింగరేణి గుర్తింపు సంఘంగా ఉన్న ఏఐటీయూసీ నోరు విప్పాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లో సింగరేణిని ప్రైవేటు పరం చేయవద్దని, ఆ ఆలోచనను వెంటనే ఉప సంహరించుకోవాలని బీఆర్ఎస్ పక్షాన డిమాండ్ చేశారు. ఈ విలేకరుల సమావేశంలో పెద్దపల్లి జడ్పీ చైర్‌పర్సన్, మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుకర్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఓరుగంటి రమణారావు, గంగుల అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డికి మంత్రి పొన్నం లీగల్ నోటీసులు

కరీంనగర్ అర్బన్, జూన్ 23: ఫ్లై యాష్ తరలింపు విషయంలో మంత్రి పొన్నం ప్రభాకర్‌పై నిరాధార ఆరోపణలు చేశాడంటూ బీఆర్ఎస్ హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డికి మంత్రి తరఫున అడ్వకేట్ పూర్ణచందర్‌రావు లీగల్ నోటీసులు జారీ చేశారు. ఎమ్మెల్యేతో పాటు టీ న్యూస్ మేనేజింగ్ డైరెక్టర్ జోగినిపల్లి సంతోష్‌కుమార్, నమస్తే తెలంగాణ దినపత్రిక చీఫ్ ఎడిటర్ తిగుళజ్జి కృష్ణమూర్తి, తెలంగాణ పబ్లికేషన్ ప్రైవేట్ లిమిటెడ్‌కు లీగల్ నోటీసులు జారీ అయ్యాయి. ఫ్లై యాష్ అనేది ఎన్టీపీసీ నుంచి ఉత్పత్తి అవుతుందని, దాన్ని వినియోగించుకునేందుకు వీలుండదని నోటీసుల్లో తెలిపారు. ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి హుజూరాబాద్‌లో ఫ్లై యాష్ లారీలను నిలిపివేసి ఓవర్‌లోడ్‌తో వెళుతున్నాయని, ప్రతి లారీకి డబ్బులు తీసుకుంటూ పంపిస్తున్నారని మంత్రి పొన్నం ప్రభాకర్ పరువుకు భంగం కలిగేలా నిరాధార ఆరోపణలు చేశారని నోటీసుల్లో పేర్కొన్నారు. వ్యక్తిగత కక్షతో రాజకీయంగా ఎదుర్కోలేక మంత్రి పొన్నం ప్రభాకర్‌పై చేసిన ఆరోపణలకుగాను ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డికి లీగల్ నోటీసులు జారీ చేశారు. ఈ వార్తను ప్రసారం చేసిన టీ న్యూస్‌తో పాటు నమస్తే తెలంగాణ దినపత్రికకు కూడా అడ్వకేట్ పూర్ణచందర్‌రావు లీగల్ నోటీసులు జారీ చేశారు.

శిథిలమైన కెనాల్ లైనింగ్



దెబ్బతిన్న లైనింగ్

మల్యాల, జూన్ 23: ఎస్సారెస్పీ కెనాల్ లైనింగ్ శిథిలం అయ్యాయి. మల్యాల మండలంలోని లంబాడిపల్లి శివారులో కొంపల్లె చెరువు సమీపంలో లైనింగ్ పూర్తిగా శిథిలమై మట్టి పెళ్లలు లేస్తున్నాయి. లైనింగ్ శిథిలమైన ప్రదేశాల్లో కెనాల్ నీటితో అక్కడ కోతకు గురై ప్రమాదకరంగా మారే అవకాశం ఉంది. ఎస్సారెస్పీ అధికారులు లైనింగ్ పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

అధ్వానం..ఈ రహదారి

మల్యాల, జూన్ 23: మల్యాల బ్లాక్ చౌరస్తా నుంచి వెళ్లే మల్యాల-పెగడపల్లి మార్గం అధ్వానంగా మారింది. ఏళ్ల తరబడిగా రహదారి విస్తరణ పనులు కొనసాగుతుండడంతో గోతులు ఏర్పడి, కంకర లేచి ప్రమాదకరంగా మారగా తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. అయిప్పటికీ పనులు పూర్తి చేయడంపై ప్రజాప్రతినిధులు, అధికారులు చొరవ చూపడం లేదు. దీంతో ప్రయాణికులు తీవ్రంగా మండిపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



కంకర తేలి ప్రమాదకరంగా మారిన రహదారి

బాలికపై వృద్ధుడి అత్యాచారం

- నిందితుడిని చితకబాది పోలీసులకు అప్పగించిన స్థానికులు
- పోక్సో కింద కేసు నమోదు

రాయికల్, జూన్ 23: జగిత్యాల జిల్లా రాయికల్ పట్టణంలో సింగు గంగనర్సయ్య (60) అనే వృద్ధుడు ఓ బాలికను మాయ మాటలు చెప్పి తన టైలర్ షాపునకు పిలిపించుకుని ఆదివారం అత్యాచారానికి ఒడిగట్టాడు. స్థానికులు నిందితుడిని చితకబాది పోలీసులకు అప్పగించారు. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. రాయికల్‌కు చెందిన సింగు గంగనర్సయ్య అనే వృద్ధుడు టైలర్ షాపు పెట్టుకుని జీవిస్తున్నాడు. తరచూ టైలర్ షాపునకు వచ్చే ఓ బాలికను ఆదివారం తన షాపునకు పిలుచుకుని మాయమాటలు చెప్పి అత్యాచారానికి ఒడిగట్టాడు. బాలిక షాపునకు వెళ్లిన తర్వాత షట్టర్ తలుపు మూసివేయడంతో గమనించిన స్థానికులు బాలిక కుటుంబీకులకు సమాచారం ఇచ్చారు. అనంతరం కుటుంబీకులతో కలిసి స్థానికులు షట్టర్‌ను తీయాలని బెదిరించడంతో ఈ ఘటన వెలుగుచూసింది. స్థానికులు వృద్ధుడిని చితకబాది అనంతరం పోలీసులకు అప్పగించారు. బాలిక తల్లి ఫిర్యాదు మేరకు వృద్ధుడిపై పోక్సో కింద కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నట్లు ఏఎస్సై దేవేందర్ తెలిపారు.

బీజేపీ నాయకులు ఆత్మపరిశీలన చేసుకోవాలి

- సన్న రకం సాగుచేసే రైతులకు రూ. 500 బోనస్ - ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి



రేచపల్లిలో కాలువను పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

సారంగాపూర్, జూన్ 23: తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు బీజేపీ పాలిత రాష్ట్రాలు, దేశంలో ఎక్కడ అమలు జరగడం లేదని ప్రభుత్వాన్ని విమర్శించే ముందు బీజేపీ నాయకులు ఆత్మ పరిశీలన చేసుకోవాలని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని రేచపల్లి గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామంలో ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులను పరిశీలించారు. అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గత ప్రభుత్వంలో కేసీఆర్ సన్నరకం సాగు చేయమని ఆంక్షలు విధించి ఏ రకమైన బోనస్ ఇవ్వకుండా రైతులను మోసం చేశాడని గుర్తు చేశాడు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏ విధమైన ఆంక్షలు లేకుండా సన్న రకం సాగు చేసే రైతులకు క్వింటాల్‌కు 500 రూపాయలు బోనస్ ఇచ్చి రైతులను ఆదుకుంటామని తెలిపారు. నిరుపేదలకు నాణ్యమైన సన్న బియ్యం పంపిణీ చేసేందుకు ప్రభుత్వం సన్న రకం సాగును రూ. 500 బోనస్ కల్పించి ప్రోత్సహిస్తుందన్నారు. రైతులపై ఆర్థిక భారం పడకుండా పంటల బీమా పథకానికి 50 శాతం రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తూ ప్రీమియం చెల్లిస్తుందని అన్నారు. గత ప్రభుత్వం పూర్తి స్థాయిలో రుణ మాఫీ చేయలేదని ఇంకా నాలుగువేల కోట్లు బకాయిలు చెల్లింపు చేయలేదన్నారు. కేసీఆర్ ప్రభుత్వం రెండు పర్యాయాలు కలిపి రూ 28వేల కోట్లు అయితే కాంగ్రెస్ ప్రభుత్వం రెండు లక్షలు ఏక మొత్తంలో రూ 31వేల కోట్లతో రుణమాఫీ చేస్తోందన్నారు. మిషన్ భగీరథ పథకం ద్వారా రాష్ట్రంలో 100 శాతం తాగు నీరందించామని కేంద్ర ప్రభుత్వానికి తప్పుడు నివేదిక సమర్పించడంతో రాష్ట్రానికి రావల్సిన నిధులు పొందలేక పోతున్నామన్నారు. దీంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాష్ట్రంలో భగీరథ నీరు ఏ మేరకు అందుతుందో పూర్తిస్థాయిలో సర్వే చేయిస్తున్నారని తెలిపారు. భవిష్యత్తులో రేచపల్లిలో నీటి కొరత ఉత్పన్నం కాకుండా గ్రామంలో మంచి నీటి బావికి ప్రభుత్వం ద్వారా మంజూరైన నిధులతో గాజుల నిర్మాణం చేపట్టామని తెలిపారు. కార్యక్రమంలో ప్రసాద్ గౌడ్, తిరుపతిరెడ్డి, ఆకుల రాజిరెడ్డి, ఇబ్రాహీం, లక్ష్మారెడ్డి, హరీష్, ఆకుల రాజిరెడ్డి, రాజన్న, తదితరులు పాల్గొన్నారు.

కాళేశ్వరం ప్రాజెక్టుపై

కాంగ్రెస్ ప్రభుత్వానికి అవగాహన శూన్యం



చర్చావేదికలో మాట్లాడుతున్న వి ప్రకాశ్

కరీంనగర్ టౌన్, జూన్ 23: కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ ప్రభుత్వానికి, సీఎం రేవంత్‌రెడ్డికి అవగాహన లేదనే విషయం స్పష్టమైందని ప్రముఖ జలవనరుల నిపుణులు వి.ప్రకాశ్ అన్నారు. ఆదివారం నగరంలోని ఫిలింభవన్‌లో డాక్టర్ బీఎస్‌రావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కాళేశ్వరాన్ని కాపాడుకుందాం అనే అంశంపై నిర్వహించిన చర్చా వేదికకు ఆయన ప్రధాన వక్తగా హాజరయ్యారు. కాళేశ్వరం ప్రాజెక్టు ప్రాముఖ్యతపై వివరంగా చర్చించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ ఎక్కడైనా బ్యారేజీలు ఇసుకలో నిర్మిస్తారా అని సీఎం రేవంత్‌రెడ్డి పదేపదే అన్నారని, బ్యారేజీలు ఇసుకలోనే నిర్మిస్తారనే విషయంపై ఆయనకు అవగాహన లేక పోవడం హాస్యాస్పదమని అన్నారు. మేడిగడ్డ బ్యారేజీకి 86 పియర్స్ ఉంటే మూడు పీయర్స్ దెబ్బతిన్నాయని అయినంత మాత్రాన ప్రాజెక్టును మూలన పడేస్తారా అని ప్రశ్నించారు. బీఆర్ఎస్‌ను ఓడించాలనే ఉద్దేశంతోనే కాంగ్రెస్, బీజేపీలు కాళేశ్వరంపై విషప్రచారం చేశాయని అన్నారు. డ్యాం సేఫ్టీ అథారిటీ కూడా ఈ పార్టీలకే వంత పాడిందని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై రేవంత్‌రెడ్డి పచ్చి అబద్ధాలు ప్రచారం చేశారని, తెలంగాణ ప్రజలు దానిని నమ్మారని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు ముందు, తర్వాత పరిస్థితులను గమనిస్తే కేసీఆర్ ప్రభుత్వం సాగునీటికి ఎంత ప్రాధాన్యత ఇచ్చిందో అర్థమవుతుందని అన్నారు. తుమ్మిడిహెట్టి వద్ద ప్రాజెక్టు కట్టవద్దని కేసీఆర్ అనలేదని, అందుకు సెంట్రల్ వాటర్ కమిషన్, అప్పటి మహారాష్ట్ర ప్రభుత్వం ఒప్పుకోలేదని స్పష్టం చేశారు. తాను ఏపార్టీలో లేనని, రాజకీయాలతో సంబంధం లేకుండా కాళేశ్వరం ప్రాజెక్టుపై తెలంగాణ ప్రజలు ఉద్యమించాలని, మేధావి వర్గం అందుకు కృషిచేయాలని కోరారు. తెలంగాణకు గుండె కాళేశ్వరం ప్రాజెక్టు అని, కేవలం మూడు పీయర్లు కుంగిపోతే ప్రాజెక్టును మూలన పడేస్తారా, పనులు చేసేందుకు ఎల్అండ్‌టీ కంపెనీ ముందుకు వచ్చినా రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు స్పందించడం లేదని బీఎస్‌రావు ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ బీఎస్‌రావు ప్రశ్నించారు. ప్రజల సొత్తు అయిన కాళేశ్వరం ప్రాజెక్టును కాపాడుకోవలసిన బాధ్యత తెలంగాణ ప్రతి పౌరుడిపై ఉందని అన్నారు. కార్యక్రమంలో జగిత్యాలకు చెందిన రాజం తదితరులు పాల్గొన్నారు.

ముందుచూపేదీ?

- యేటా వర్షాకాలంలో నీట మునుగుతున్న కాలనీలు - పట్టించుకోని అధికారులు



కాలనీలో నీట మునిగిన ఇళ్లను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ (ఫైల్)



రాయికల్‌లో నీట మునిగిన కేశవనగర్ (ఫైల్)

రాయికల్, జూన్ 23: అధికారులు ముందస్తు చర్యలు తీసుకోకపోవడంతో యేటా వర్షాకాలంలో రాయికల్ పట్టణంలోని పెద్ద చెరువు వరదతో ముంపు ఏర్పడుతుంది. పట్టణ శివారు కాలనీలు నీట మునుగుతుండటంతో కాలనీవాసులు ఆందోళన చెందుతున్నారు. పెద్ద చెరువు 200 ఎకరాల విస్తీర్ణంలో ఉండగా, రాయికల్, మైతాపూర్, చెర్లకొండాపూర్ గ్రామాలకు సాగునీరు అందడంతో పాటు భూగర్భజలాల పెంపునకు ఎంతో దోహదపడుతుంది. వర్షాకాలంలో చెరువు నిండి వరదనీరు ఉప్పొంగి ప్రవహించినప్పుడు పట్టణంలోని 5, 6, 7 వార్డుల్లోని ఇళ్లలోకి నీరు చేరుతుంది. భీమన్నవాడ, మత్తడి వాడ, గొల్లవాడ, కేశవనగర్ కాలనీవాసులు వర్షాకాలం వచ్చిందంటే ఆందోళన చెందుతున్నారు. అంతేగాకుండా పెద్ద చెరువు నిండినప్పుడు చెర్లకొండాపూర్, రాయికల్, మైతాపూర్‌లోని చెరువు కట్ట తీర ప్రాంతాల్లోని వ్యవసాయ పొలాలు నీట మునగడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా రు. లోలెవల్ వంతెనతో వర్షాకాలంలో ప్రజలకు ముప్పు పొంచి ఉంది. చిన్న వర్షాలకు సైతం లోలెవల్ వంతె నలపై నుంచి వరద నీరు ప్రవహించడంతో రాకపోకలు నిలిచిపోతు న్నాయి. మండలంలోని ఇటిక్యాల, మూటపెల్లి, వస్తాపూర్, ధర్మాజీపేట, రామాజీపేట గ్రామాల్లో లోలెవల్ వంతెనలు ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి నివారణ చర్యలు చేపట్టి ముంపునకు గురి కాకుండా చూడాలని కోరుతున్నారు.

ఇళ్లల్లోకి వరద నీరు వస్తోంది..



రాయికల్ పట్టణంలో గత ఏడాది కురిసిన భారీ వర్షాలకు కేశవనగర్, గొల్లవాడ, మత్తడివాడ, భీమన్నవాడలోకి నీరు చేరడంతో చాలా ఇబ్బందులు ఎదుర్కొన్నాం. ఇప్పటికైనా అధికారులు స్పందించి వర్షాకాలంలో ముందస్తు చర్యలు తీసుకొని నీరు చేరకుండా చూడాలి

- నీలి తిరుపతి, సింగిల్ విండో డైరెక్టర్

ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదు..



మా వార్డులో వర్షం పడితే చాలు ఇళ్లలోకి నీరు వస్తున్నాయి. ఎన్నిసార్లు అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదు. ఈసారైనా వరదలు రాక ముందే చర్యలు చేపడితే కాలనీవాసులకు ఇబ్బందులు ఉండవు. ప్రభుత్వం, అధికారులు స్పందించి ముంపు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలి. వర్షాలు కురిస్తే ఇబ్బందులు రాకుండా చూడాలి.

- అన్వరీ బేగం, 6వ వార్డు కౌన్సిలర్, రాయికల్

'రుణ మాఫీ'పై కాంగ్రెస్ శ్రేణుల సంబరాలు



సుల్తానాబాద్‌లో సంబరాలు జరుపుకుంటున్న కాంగ్రెస్ నాయకులు



కమాన్‌పూర్‌లో..



ఎలిగేడులో..

సుల్తానాబాద్, జూన్ 23: గత ఎన్నికల సందర్భంగా పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకుందని కాంగ్రెస్ నాయకులు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు రెండు లక్షల రుణమాఫీ అంశాన్ని మంత్రి వర్గంలో ఆమోదం తెలిపిన సందర్భాన్ని పురస్కరించు కుని సుల్తానాబాద్‌లో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆదివారం సంబరాలు జరుపుకున్నారు. సుల్తానాబాద్ జడ్పీటీసీ మినుపాల ప్రకాష్‌రావు, మున్సిపల్ చైర్‌పర్సన్ గాజుల లక్ష్మిరాజమల్లు, సర్పంచ్ ఫోరం మాజీ జిల్లా అధ్యక్షులు అంతటి అన్నయ్యగౌడ్, పన్నాల రాములు, సాయిరి మహేందర్, ఎంపీటీసీ మండల రమేష్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు దామోదర్‌రావు, ఇల్లెందుల శ్రీనివాస్‌గౌడ్ తదితరులు స్థానిక ఐబీ చౌరస్తా వద్ద స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ, మండల శాఖ అధ్యక్షులు అబ్బయ్యగౌడ్, చిలుక సతీష్, నాయకులు అమిరిశెట్టి రాజలింగం, తిరుపతి, ఎండీ అమీనొద్దీన్, నోముల రాజిరెడ్డి, టికే ప్రభాకర్, కుమార్ కిషోర్, మెంగని శ్రీవివాస్, మొండయ్య, మోబిన్, చక్రపాణి, బుచ్చిబాబు, గడ్డం అనిల్, మేకల పోచం, శ్రీనివాస్, గణేష్ రవీందదర్ పాల్గొన్నారు.

కమాన్‌పూర్, జూన్ 23: రైతు రుణమాఫీకి కేబినెట్ పచ్చజెండా ఊపి రైతాంగ ప్రభుత్వంగా పేరు తెచ్చుకోవడాన్ని హర్షిస్తూ ఆదివారం మండల కేంద్రంలో మండల కన్వీనర్ సయ్యద్ అన్వర్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి శ్రీధర్‌బాబులకు చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. అనంతరం స్వీట్లు పంచుతూ సంబరాలు జరుపుకున్నారు.

ఎలిగేడు, జూన్ 23 : ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన రాష్ట్ర క్యాబినేట్ సమావేశంలో రైతులకు ఇచ్చిన హామీ మేరకు రైతులకు రూ.2లక్షల రుణమాఫీ చేయడానికి నిర్ణయం తీసుకున్న సందర్భంగా మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో స్వీట్లు పంపిణీచేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు సామ రాజేశ్వర్‌రెడ్డి, రాష్ట్ర యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి దుగ్యాల సంతోష్‌రావు, జడ్పీవైస్ చైర్మన్ మండిగ రేణుకరాజనర్సు, సుల్తాన్‌పూర్ మాజీ సర్పంచ్ వెంకటేశ్వర్‌రావు, మాజీ ఉపసర్పంచ్‌లు వెంకటేశ్వర్‌రావు, పల్లెర్ల వెంకటేష్, ర్యాకల్‌దేవ్‌పల్లి సిద్ధ తిరుపతి, మాజీ వార్డు సభ్యులు, గ్రామ పార్టీ అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జూలపల్లి, జూన్ 23 : మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధానకార్యదర్శి గండు సంజీవ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, తెలంగాణ ఐటీశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీదర్‌బాబు, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణరావుల చిత్రపటానికి ఆదివారం పాలాభిషేకం చేశారు. ముఖ్య అతిథులు కాంగ్రెస్ పార్టీ నాయకులు ధూళికట్ట సింగిల్ చైర్మన్ పుల్లూరి వేణుగోపాలరావు, జూలపల్లి మాజీ సర్పంచ్ దారాబోయిని నర్సింగ్‌యాదవ్‌లు మాట్లాడుతూ పేద ప్రజల సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ పార్టీ నిరంతరం పనిచేస్తుందన్నారు. ఈకార్యక్రమంలో ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు దండే వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బొజ్జ శ్రీనివాస్, మాజీ ఉపసర్పంచ్ ఆడవాళ్ల తిరుపతి, బీసీ సెల్ మండల అధ్యక్షుడు బండి స్వామి, రైతు సమన్వయ సమితీ మండల అధ్యక్షుడు సిరికొండ కొమురయ్య, సిదురి శ్రీనివాస్, యూత్ మాజీ మండల అధ్యక్షుడు మానుమండ్ల శ్రీనివాస్, కందునూరి అంజయ్య, కొమ్మ పోచాలు, అమరగాని లింగయ్యగౌడ్, గరికిరెడ్డి దేవేందర్‌రెడ్డి, ప్రసాద్, స్వామి, ఈర్ల స్వామి, చెరుకు కనకయ్య, పాతకుల మహేష్, పోట్యాల భీరయ్య, అతిక్‌పాషా, పెసర లచ్చయ్య, అమర్‌గాని సాయిగౌడ్, వడ్లూరి అంజయ్య, నెరవట్ల దుర్గయ్య తదితరులు పాల్గొన్నారు.



జిల్లా కేంద్రంలో సంబరాలు జరుపుకుంటున్న కాంగ్రెస్ నాయకులు

ఓదెల, జూన్ 23 : రాష్ట్ర ప్రభుత్వం రైతులకు రూ.రెండు లక్షల బ్యాంకు రుణాలను మాఫీ చేయడం పట్ల ఆదివారం మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు సంబరాలను నిర్వహించారు. గ్రామ కూడలిలో బాణసంచా పేల్చి, స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మూల ప్రేమ్‌సాగర్‌రెడ్డి, సింగిల్విండో చైర్మన్ ఆళ్ళ సుమన్‌రెడ్డి, బైరి రవి, బోడకుంట శంకర్, పడాల రాజు, బోడకుంట స్వామి, నాగపురి రవీందర్‌గౌడ్, వంగ రాజమల్లు, పిట్టల నర్సింగం, కుంచం మల్లయ్య, పచ్చిమట్ల శ్రీనివాస్,ఆకుల మహేందర్, బండారి కుమారస్వామి, అల్లం సతీష్, దొడ్డే శంకర్, జక్కుల వెంకటస్వామి, వంగ కుమార్ యాదవ్ తో పాటు తదితరులు పాల్గొన్నారు.

పెద్దపల్లిటౌన్, జూన్ 23: తెలంగాణలో అసెంబ్లీ ఎన్నికల వేళ ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేరుస్తుందని పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణరావు పేర్కొన్నారు. రైతులకు ఏకకాలంలో రెండు లక్షల రుణమాఫీకి క్యాబినెట్ ఆమోదం తెలపడం పట్ల ఎమ్మెల్యే హర్షం వ్యక్తం చేస్తూ ఆదివారం జిల్లా కేంద్రంలోని జెండా చౌరస్తాలో స్థానిక రైతులు, కాంగ్రెస్ నాయకులతో కలిసి స్వీట్లు పంపిణీ చేసి సంబరాలు జరుపుకున్నారు. అనంతరం విజయరమణరావు మాట్లాడుతూ ఆగస్టు 15 లోగా రైతులందరికీ రూ.2 లక్షల వరకు ఏకకాలంలో రుణమాఫీ చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని ప్రతిపాదనలు సిద్ధం చేసిందని తెలిపారు. రుణమాఫీతో పాటు ప్రకృతి వైపరీత్యాలతో పంట నష్టపోయిన రైతులకు పరిహారం ఇచ్చేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఎమ్మెల్యే తెలిపారు. రైతన్నలను రుణ విముక్తి చేస్తూ ఏకకాల రుణమాఫీకి శ్రీకారం చుడుతున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి జడ్పీటీసీ బండారి రాంమూర్తి, నూగిళ్ళ మల్లయ్య, మండల సత్యనారాయణరెడ్డి, బొడ్డుపెల్లి శ్రీనివాస్. సయ్యద్ మస్రత్, ఈర్ల స్వరూప, సర్వర్, కీర్తి రాజయ్య, సందనవేన రాజేందర్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

రామగిరి, జూన్ 23: రైతులకు ఒకే దఫా రెండు లక్షల రుణమాఫీపై ప్రకటించిన రేవెంత్‌రెడ్డి, ఐటిశాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్‌బాబుల చిత్రపటాలకు ఆదివారం కాంగ్రెస్, ఐఎన్‌టీయుసీ నాయకులు క్షీరాభిషేకం చేశారు. స్థానిక మార్కెట్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రోడ్డ బాపన్న, ఆర్జీ-3 ఉపాధ్యక్షుడు కొటరవీందర్‌రెడ్డిల ఆధ్వర్యంలో కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో హజరై క్షీరాభిషేకం చేసి స్వీట్లు పంపిణి కార్యక్రమాన్ని చేపట్టారు.

ఈ కార్యక్రమంలో నాయకులు తొటచంద్రయ్య, ఎంపీటీసీ చిందం మహేష్, గంట వెంకటరమణరెడ్డి, కాటంసత్యం, వేము కనకయ్య, ముచ్చకుర్తి శ్రీనివాస్, ముస్త్యాలశ్రీనివాస్, శంకర్, మల్లేష్, పివిగౌడ్, షైదం వరప్రసాద్, ఒర్రె సది, పలువురు కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.



జూలపల్లిలో..



ఓదెలలో..



రామగిరిలో..

ప్రహరీ నిర్మించాలి

కాల్వశ్రీరాంపూర్, జూన్ 23: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రహరిగోడతో పాటు మైదానం చదును చేయాలని కళాశాల విద్యార్థులు ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేస్తున్నారు. మండల కేంద్రంలోని పాండవుల గుట్టపై ఉన్న ప్రభుత్వ కళాశాల చుట్టూ ప్రహరీ లేని కారణంగా పశువులు కళాశాలమైదానంలోనే మేతమేస్తున్నాయని వారు పేర్కొన్నారు. దీంతో మైదానమంతా పశువుల పేడతో నిండి అపరిశుభ్రంగా మారిందన్నారు. అంతేకాకుండా రాత్రి సమయంలో కళాశాల మైదానంలోనే మందుబాబులు మందు తాగుతూ ఖాళీ సీసాలను కళాశాలలోనే వదిలిపెట్టి పగుల గొట్టి పోతున్నారన్నారు. కళాశాలమైదానం ప్రహరీ లేని కారణంగా కొందరు ఈ కళాశాలలోని కొంత స్థలం ఆక్రమించేందుకు ప్రయత్నించగా దీంతో కళాశాల ప్రిన్సిపాల్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఆక్రమణ నిలిచిపోయింది. మైదానం ఎత్తు వంపులుగా ఉన్న కారణంగా కళాశాలకు వస్తున్న విద్యార్థులు ఆటలాడుకోవడానికి ఇబ్బందులు పడుతున్నామన్నారు. కళాశాల మైదానం గుంతలు గుంతలుగా ఎత్తు వంపులుగా ఉండడం కారణంగా క్రీడలకు దూరం అవుతున్నామని కళాశాల విద్యార్థులు వాపోతున్నారు. కళాశాల పక్కన ఉన్న పాండవుల గుట్ట ప్రాంతంలో ఉన్న మట్టిని తీసి మైదానాన్ని చదును చేయించాలని కళాశాల విద్యార్థులు కోరుతున్నారు. గతంలో ఎన్నోసార్లు సంబంధిత ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకుపోయిన ఈ కళాశాల సమస్యల గురించి ఎవరు పట్టించుకోలేదని విద్యార్థులు వాపోయారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి కళాశాల చుట్టూ ప్రహరీ నిర్మించి మైదానాన్ని చదును చేయించాలని కోరుతున్నారు.

నష్ట పరిహారంపై నిర్దిష్ట ఒప్పందం జరగాలి

యైటింక్లయిన్‌కాలనీ, జూన్ 23: కాంట్రాక్టు కార్మికులకు భరోసానిచ్చేలా ప్రమాదాల్లో గాయపడ్డా, మృతిచెందిన నిర్దిష్ట పరిహారం చెల్లించే విషయంలో యాజమాన్యం కార్మిక సంఘాలతో ఒప్పందం చేసుకోవాల్సిన అవసరం ఉన్నదని సింగరేణి కాంట్రాక్టు కార్మిక సంఘం ఆర్జీ-2 గౌరవ అధ్యక్షుడు ఉల్లి మొగిలి ప్రకటనలో పేర్కొన్నారు. మూడు రోజుల క్రితం వకీల్‌పల్లె గనిలో పనిచేస్తున్న జనగామ శర్మ అనే కాంట్రాక్టు కార్మికుడు మృతిచెందాడని, కార్మిక సంఘాలు ఆందోళన చేసిన మీదట వివిధ రూపాల్లో 15 లక్షల పరిహారం చెల్లించేలా ఒప్పందం జరిగినట్టు తెలిపారు. పలు సందర్భాల్లో కాంట్రాక్టు కార్మికులు ప్రమాదాల బారినపడి మరణిస్తే సందర్భాన్ని బట్టి, సంఘాల ఆందోళన తీవ్రతను బట్టి పరిహారం నిర్ణయించబడుతున్నదని మొగిలి తెలిపారు. కాంట్రాక్టు కార్మికులు విధుల్లో మరణించినా, ప్రమాదాల్లో రణించినా వారికి చెల్లించాల్సిన పరిహారంతో పాటు కార్మికుడి కుటుంబానికి ఉద్యోగం అంశంపై అన్ని కార్మిక సంఘాలతో చర్చించి ఒప్పందం చేసుకోవాలని మొగిలి డిమాండ్ చేశారు. ఈదిశగా అన్ని సంఘాలు ఉద్యమించాల్సిన అవసరం ఉన్నదని ఉల్లి మొగిలి ప్రకటనలో పేర్కొన్నారు.

కార్మిక సంఘాల ఆందోళనతో 15 లక్షల పరిహారం

వకీల్‌పల్లె గనిలో మరణించిన కాంట్రాక్టు కార్మికుడు జనగామ శర్మ కుటుంబానికి రూ.15 లక్షల పరిహారం చెల్లించేందుకు సింగరేణి యాజమాన్యం అంగీకరించినట్టు ఇఫ్టూ జిల్లా ప్రధానకార్యదర్శి బీ అశోక్ పేర్కొన్నారు. మూడు రోజులపాటు కార్మిక సంఘాలు ఆందోళన చేసిన మీదట యాజమాన్యం దిగివచ్చిందని,పరిహారంతోపాటు మృతుని కుటుంబంలో ఇద్దరికి కాంట్రాక్టు కార్మికులుగా అవకాశం కల్పించేందుకు అంగీకరించినట్టు పేర్కొన్నారు. సింగరేణి యాజమాన్యం రూ.5లక్షలు, కాంట్రాక్టర్స్ అసోసియేషన్ రూ.6 లక్షలు, ఆఫీసర్స్ అసోసియేషన్ రూ.2 లక్షలు, సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా 2లక్షలకు యాజమాన్యం అంగీకరించిందన్నారు.

నీట్ పేపర్ లీకేజీపై విచారణ చేపట్టాలి

గణేశ్‌నగర్, జూన్ 23: 24 లక్షల మంది విద్యార్థుల నీట్ పరీక్ష లో జరిగిన అవకతవకలు, అక్రమాలపై సమగ్ర విచారణ జరపాలని, దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఆదివారం గీత భవన్ చౌరస్తా లో కరీంనగర్ జిల్లా యువజన కాంగ్రెస్ శాఖ ఆధ్వర్యంలో మోడీ దిష్టిబొమ్మ దగ్ధం చేశారు, ఈ సందర్భంగా పడా యువజన కాంగ్రెస్ అధ్యక్షులు రాహుల్ మాట్లాడుతూ ప్రపంచంలో జరగుతున్న దేశాల మధ్య యుద్ధన్ని ఒక్క ఫోన్ కాల్ తో ఆపిన మోడీ దేశంలో నిత్యం జరుగుతున్న పేపర్ లీకులను ఆపేలేడ అంటూ ప్రశ్నించారు.ఆదె విధంగా 5 డిమాండ్లు తక్షణమే అమలు చేయాలి అని కోరారు. నీట్ పరీక్ష రద్దు చేయాలని నీట్ పరీక్ష లో జరిగిన పేపర్ లీకు, అవకతవకలు కు కారకుల పై సిట్టింగ్ జడ్జితో విచారణ చేసి చట్ట రీత్యా చెర్యలు తీసుకోవాలని అన్నారు. సక్రమంగా పరీక్ష నిర్వహించలేని ఎన్‌టిఎ (నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ) నీ రద్దు చేయాలని,24గంటలోపు కేంద్ర ప్రభుత్వం నీట్ పరీక్ష విషయం లో స్పందించక పోతే తెలంగాణ లో ఉన్న కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ ఇండ్లు, క్యాంప్ కార్యాలయలు ముట్టడి స్తామని హెచ్చరించారు.



ప్రధాని మోదీ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న యూత్ కాంగ్రెస్ నాయకులు

కేంద్ర విద్య శాఖ మంత్రి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ డిస్ట్రిక్ కాంగ్రెస్ కమిటీ అధికార ప్రతినిధి రేగొండ సందీప్, కరీంనగర్ యూత్ కాంగ్రెస్ వైస్ ప్రెసిడెంట్ అట్లా అనిల్, ముదిరాజ్ నవాజ్, కరీంనగర్ డిస్ట్రిక్ జనరల్ సెక్రెటరీ కృప సాగర్, యూత్ కాంగ్రెస్ అధికారప్రతినిధి అజీమ్, గట్టు ప్రశాంత్, మాడుగుల ప్రవీణ్, కరీంనగర్ డిస్ట్రిక్ యూత్ కాంగ్రెస్ కమిటీ సెక్రెటరీ ఆశిష్ గౌడ్, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

-కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్

కరీంనగర్ టౌన్, జూన్ 23: ప్రతి ఒక్కరూ మొక్కలను విరివిగా నాటాలని కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్‌కుమార్ పిలుపునిచ్చారు. చెట్లతోనే పర్యావరణ పరిరక్షణ జరుగుతుందని అన్నారు. జల సంరక్షణ.. వన సంరక్షణపై ప్రచురించిన వాల్ పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నీరు కలుషితం కాకుండా చూసుకోవాలన్నారు. వృథాగా ఏరులై పారే వర్షపు నీటిని ఒడిసి పట్టి ఇంకుడు గుంతలకు మళ్లించాలని అన్నారు. తద్వారా భూగర్భ జలాలు పెరిగి నీటికష్టాలు తీరుతాయని అన్నారు. ప్రకృతి వనరులైన అడవులను, జలవనరులను, కాపాడుకుంటే అవి సమస్త మానవాళిని కాపాడు తాయని అన్నారు. ఈకార్యక్రమంలో పర్యావరణ వేత్త తోట లక్ష్మన్‌రావు, పెద్ది లక్ష్మీనారాయణ, సామ నారాయణ, పెద్ది రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామి ఆలయంలో ధ్వజారోహణం

కరీంనగర్ కల్చరల్, జూన్ 23: నగరంలోని భగత్‌నగర్ జెడ్‌పి క్వార్టర్స్ ఆవరణలో గల ప్రాచీన వేంకటేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా పాంచరాత్ర ఆగమ శాస్త్రోక్తంగా ఆదివారం ఉదయం నిత్య ఆరాధన, అగ్నిప్రతిష్ఠ, ధ్వజారోహణం, హవనం జరిగాయి. కార్యక్రమంలో ఈఓ కొన్న కాంతారెడ్డి, భక్తులు పాల్గొన్నారు. కాగా సోమవారం ఉదయం 10-30 గంటల నుంచి వేంకటేశ్వరస్వామి కల్యాణం జరుగుతుందని పేర్కొన్నారు. కల్యాణం అనంతరం మేయర్ సునీల్‌రావు ఆధ్వర్యంలో అన్నదానం ఉంటుందని తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని శ్రీవారి కృపకు పాత్రులు కావాలని ఈఓ కాంతారెడ్డి కోరారు.

పర్సు అప్పగింత

కరీంనగర్ క్రైం, జూన్ 23: చింతకుంటలో రోడ్డుపై లభించిన పర్సును పోగొట్టుకున్న బాధితుడికి అందజేసిన ఓ కార్మికుడు తన నిజాయితీని చాటుకున్నాడు. కొత్తపల్లి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మానకొండూర్ మండలం కొండపల్కల గ్రామానికి చెందిన షేక్‌హుస్సేన్ ఆదివారం ఉదయం కొత్తపల్లి మండలంలోని చింతకుంటలో ఉన్న తన కూతురు వద్దకు వెళ్లాడు. అతను వాహనంపై వెళుతున్న క్రమంలో నాలుగు వేల రూపాయలు నగదుతో ఉన్న పర్సు, ఇతర ధ్రువీకరణలు, బ్యాంకు ఏటీఎం దారిలో పోగొట్టుకున్నాడు. చింతకుంటలోని ఒక రెడ్‌మిక్స్‌లో కార్మికుడిగా పనిచేస్తున్న ఎడపల్లి తిరుపతి కరీంనగర్‌కు వెళ్లి ద్విచక్ర వాహనంపై తిరిగి వస్తుండగా నగదుతో కూడిన పర్సు, ఇతర ధ్రువీకరణలు లభించాయి. వీటిని తీసుకున్న తిరుపతి కొత్తపల్లి పోలీసు ఠాణాలో అప్పగించాడు. విధుల్లో ఉన్న హెడ్ కానిస్టేబుళ్ళు కృష్ణారెడ్డి, మహేష్, అలీబేగ్‌లు పర్స్‌లో లభించిన ఆధారాలను పరిశీలించి బాధితుడికి సమాచారం అందించారు. బాధితుడికి పోలీసుల సమక్షంలో పోగొట్టుకున్న పర్సు అందజేశారు. కార్మికుడు తిరుపతిని కొత్తపల్లి ఎస్ఐ ఎస్ సాంబమూర్తి అభినందించారు.

'కరీంనగర్ కవులు నాడు-నేడు' పుస్తకావిష్కరణ



పుస్తకావిష్కరణ చేస్తున్న పెద్దపల్లి అడిషనల్ కలెక్టర్

కరీంనగర్ కల్చరల్, జూన్ 23: తెలంగాణ రచయితల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ముఖరంపుర వాగీశ్వరి డిగ్రీ కళాశాలలో సంపాదకుడు, గ్రంథ ప్రచురణ కర్త, తెలుగు విశ్వవిద్యాలయం పూర్వ ఉప కులపతి ఆచార్య అనుమాండ్ల భూమయ్యచే వెలువరించిన 'కరీంనగర్ కవులు నాడు-నేడు' పుస్తకావిష్కరణకు పెద్దపల్లి జిల్లా అడిషనల్ కలెక్టర్ జీవి శ్యాంప్రసాద్‌లాల్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నాటి నుంచి నేటి వరకు కవిత్వం రాసిన కవుల కవితలను 'కరీంనగర్ కవులు నాడు-నేడు' పుస్తకం పేరుతో సంకలనంగా తీసువచ్చి జన్మభూమికి సాహితీ కానుకగా ఇచ్చిన ఆచార్య అనుమాండ్ల భూమయ్య కృషి అభినందనీయమని అన్నారు. ఆచార్య అనుమాండ్ల భూమయ్య మాట్లాడుతూ తనకు జన్మ నిచ్చిన కరీంనగర్ కవుల కవితలను సంకలనంగా తీసుకు రావడం ఎంతో సంతృప్తినిచ్చిందని అన్నారు. సాహితీవేత్తలు డాక్టర్ మలయశ్రీ, డాక్టర్ గండ్ర లక్ష్మణ రావు, డాక్టర్ నలిమెల భాస్కర్, వారాల ఆనంద్‌లకు ఆత్మీయ సత్కారాలు ఘనంగా జరిపారు. సంస్థ అధ్యక్షుడు కొత్త అనిల్‌కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు డి రాజారాంమోహన్, ప్రధాన కార్యదర్శి దొమ్మాటి శంకర్‌ప్రసాద్, నగునూరి శేఖర్ పాల్గొన్నారు.

చేనేత సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళతాం

భగత్‌నగర్, జూన్ 23: రాష్ట్రంలో చేనేత కార్మికులు ఎదుర్కొంటున్న రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు సహకారంతో ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళతామని అఖిలభారత పద్మశాలి సంఘం జాతీయ అధ్యక్షుడు కందగట్ల స్వామి, రాష్ట్ర అధ్యక్షుడు కామారపు మురళి అన్నారు. కొత్తపల్లి మండల కేంద్రంలోని ఇటీవల ఆత్మహత్య చేసుకున్న బొల్లబత్తిని వెంకటేశం, సిరిమల్ల గణేష్ కుటుంబాలను వారు పరామర్శించి, ఆర్థిక సహాయాన్ని అందించారు. కార్యక్రమంలో జాతీయ ప్రధాన కార్యదర్శి గడ్డం జగన్నాథం, రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు మెతుకు సత్యం, ప్రధానకార్యదర్శి మాచర్ల రామచంద్ర రావు, రాష్ట్ర రాజకీయ వ్యవహారాల కమిటీ చైర్మన్ వాసాల రమేశ్ పాల్గొన్నారు.

యూత్ కాంగ్రెస్ నాయకుడికి సన్మానం

కమాన్‌పూర్, జూన్ 23 : భూసా లక్ష్మయ్య చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ప్రజలకు మెరుగైన సేవలందించినందుకు ఇటీవల సేవ మిత్ర అవార్డు అందుకున్న మంథని యూత్ కాంగ్రెస్ డివిజన్ ప్రధానకార్యదర్శి మహమ్మద్ యూసూఫ్ లాల్లును ఆదివారం కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ సయ్యద్‌అన్వర్, మాజీ ఉపసర్పంచ్ పిల్లి రాజులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

పద్మశాలి సంఘం అధ్యక్షుడిగా రమేష్

జూలపల్లి, జూన్ 23: మండల పద్మశాలి సంఘం అధ్యక్షుడిగా మెరుగు రమేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యాడు. సంఘం జిల్లా అధ్యక్షుడు వేముల రామ్మూర్తి ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ఆదివారం సమావేశాన్ని నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా నియామకం చేశారు. ఉపాధ్యక్షుడిగా కొండ సత్యనారాయణ, కోడూరి రాజేశ్వర్, ప్రధాన కార్యదర్శి సిరిపురం సత్యం, కోశాధికారి మెరుగు కనకయ్య, కార్యవర్గ సభ్యులుగా రుద్ర రాజేశం, అందె కనుకయ్య, నాగుల వెంకటేశం, కోడూరి శ్రీనివాస్, బైరి భూమయ్య, మహిళ అధ్యక్షురాలిగా కొండ విజయ, పలువురు పద్మశాలి కులస్థులు పాల్గొన్నారు.

కార్మిక నాయకుడిని సన్మానించిన బీఆర్ఎస్ నాయకులు



కౌశిక హరిని సన్మానిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

అంతర్గాం, జూన్23: అంతర్గాం మండల పరిధిలోని టీటీఎస్ అంతర్గాంలో ఆదివారం కార్మిక నేత కేశోరాం సిమెంట్ ఫ్యాక్టరీ గుర్తింపు సంఘం నాయకుడు కౌశిక హరిని బీఆర్ఎస్ నాయకులు, మాజీ ప్రజా ప్రతినిధులు శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కార్మిక నాయకుడు కౌహకి హరి మాట్లాడుతూ కార్మిక హక్కుల సాధన కోసం నిరంతరం పోరాడుతానని పేర్కొన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పని చేస్తానని తెలిపారు. కేశోరాం ఎన్నికల్లో ప్రలోబాలకు లొంగకుండా తనను గెలిపించుకున్న కార్మికులకు అండగా నిలబడుతానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తిరుపతినాయక్, కార్పొరేటర్ కౌశిక లత, మాజీ సర్పంచ్‌లు, కుర్ర వెంకటమ్మనూకరాజు, బండారి ప్రవీణ్, సందెల దివ్యమల్లేష్, వైస్ ఎంపీపీ మట్ట లక్ష్మీమహేందర్‌రెడ్డి, శంకర్‌రెడ్డి పాల్గొన్నారు.

సేవా పతకాలు

పెద్దపల్లిటౌన్, జూన్ 23: విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేసి ప్రజల మన్ననలు పొందడంతో పాటు వారు పని చేసే శాఖలో ఉన్నతాధికారులతో గుర్తింపు పొందిన ఉద్యోగుల సేవలను రాష్ట్ర ప్రభుత్వం గుర్తించింది. ప్రతీ ఏటా తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా ప్రకటించి పురస్కారాలకు పెద్దపల్లి ప్రాంతంలో పనిచేసే ఫైర్ ఆఫీసర్ దేవనంది శ్రీనివాస్, ఇంటెలిజెన్స్ హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న ఎడ్ల విజయ్ కుమార్‌ను ఎంపిక చేసింది. వీరికి సేవా పతకంతో పాటు రూ.20వేలు చొప్పున నగదు పురస్కారం అందించనున్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



పాల్గొన్న పూర్వ విద్యార్థులు

పెద్దపల్లి రూరల్, జూన్ 23: పెద్దపల్లి మండలంలోని పెద్దకల్వల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2003-2006 సంవత్సరంలో చదువుకున్న బీకాం గ్రూప్ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నారు. ఈ సంద ర్భంగా విద్యార్థులు చదువుకునే సమయంలో జరిగిన మధుర స్మృతులను గుర్తు చేసుకుని సంతోషం వ్యక్తం చేశారు. చదువకునే సమయంలో పాఠాలు భోదించిన అధ్యాపకులను సత్కరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మీనర్సయ్య, అధ్యాపకులు పర్శరామ్, క్రిష్ణ, ఆంజనేయులు, పూర్వ విద్యార్థులు క్రిష్ణ, హరిబాబు, కిరణ్, వంశీకృష్ణ మహేందర్, కార్తీక్, ఉమాదేవి సుమతి నాగజ్యోతి, కవిత పాల్గొన్నారు.

రామగుండం ఎలక్ట్రానిక్ మీడియా కన్వీనర్‌గా రవీందర్



మార్కండేయకాలనీ, జూన్23: రామగుండం ఎలక్ట్రానిక్ మీడియా కన్వీనర్‌గా గంట రవీందర్‌ను శనివారం ఎన్నుకున్నట్లు ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రవీందర్ మూడు దశాబ్దాలుగా ఎలక్ట్రానిక్ మీడియా రంగంలో పని చేస్తున్నారు. ఆయన ఎన్నిక పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు.

నేడు క్రీడా పాఠశాలల ఎంపిక పోటీలు

మంథని, జూన్ 22: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఈనెల 24న మండల స్థాయి క్రీడా పాఠశాల ఎంపిక పోటీలను నిర్వహించనున్నట్లు ఎంఈవో దాసరి లక్ష్మి శనివారం తెలిపారు. ఈవిద్యా సంవత్సరంలో 4వ తరగతి చదువుతూఉండాలని, పోటీలకు హాజరయ్యేవారు 3వ తరగతి ప్రోగ్రెస్, అధార్ కార్డులు, స్టడీ సర్టిఫికెట్లతో మండల కో-అర్డినేటర్ కొమరోజు శ్రీనివాస్ వద్ద రిపోర్టు చేయాలని సూచించారు. ఈపోటీలో ఎంపికైన విద్యార్థులను ఈనెల 27, 28వ తేదీల్లో పెద్దపల్లిలో జరిగే జిల్లా స్థాయి ఎంపికకు పంపిస్తామన్నారు.

●ఎలిగేడు: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఈనెల 24న హైదరాబాద్, కరీంనగర్, ఆదిలాబాద్ తెలంగాణ స్పోర్ట్స్‌లో 4వ తరగతి అడ్మిషన్స్ కోసం సెలక్షన్స్ నిర్వహించడం జరుగుతుందని మండల విద్యాధికారి కవిత తెలిపారు. 4వ తరగతి అడ్మిషన్ సెలక్షన్‌లో పాల్గొను బాలబాలికలు 1.9.2015నుండి 31.8.2016 మధ్యలో జన్మించి ఉండాలని, 2024-2025లో 4వ తరగతి చదువుతున్న బోనాఫైడ్ సర్టిఫికెట్ వెంట తెచ్చుకోవాలని సెలక్షన్‌లో హైట్, వెయిట్, స్టాండింగ్‌జంప్ 800మీటర్లు పరుగు తదితర టెస్టులు ఉంటాయిని మండలంలోని 12గ్రామాల బాలబాలికలు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

●ఓదెల: మండలంలోని కనగర్తి దాసరి పద్మ, హనుమయ్య జెడ్పిహెచ్ఎస్‌లో 24న, క్రీడా పాఠశాలల్లో 4వ, తరగతి ప్రవేశం కోసం మండల స్థాయి ఎంపిక పోటీలను నిర్వహించనున్నట్లు ఎంఈఓ రాజయ్య తెలిపారు. ఉదయం 10 గం,ల వరకు ఒరిజినల్ ఆధార్ కార్డు, 4వ తరగతి స్టడీ సర్టిఫికెట్, రెండు పాస్ ఫోటోలు అందజేయాలని కోరారు. హకీంపేట్, మేడ్చల్, కరీంనగర్ లో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న క్రీడా పాఠశాలల్లో 2024-25 విద్యా సంవత్సరానికి గాను నాల్గవ తరగతిలో ప్రవేశాలు కొనసాగుతున్నాయని ఎంఈఓ తెలిపారు. సమావేశం అనంతరం ఇటీవల ప్రమోషన్ పై వచ్చిన ఫిజికల్ డైరెక్టర్లు శ్రీ విష్ణు, హరికృష్ణ, రాజేందర్ రెడ్డి, సదానందం లను స్వాగతిస్తూ సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రమేష్ పీఈటీలు స్వరూప, కుమార్ పాల్గొన్నారు.

●ముత్తారం: 2024,25 విదా సంవత్సరానికి గాను క్రీడా పాఠశాలల్లో 4వ తరగతి ప్రవేశం కోసం జిల్లా పరిషత్ ఉన్నత పాశాల ముత్తారం నందు ఈ నెల 24,25 తేదీలలో క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు మండల విధాధికారిని శ్రీమతి దాసరి లక్ష్మీ తెలిపారు. ఈ క్రీడా పాఠశాలల ఎంపిక పోటిలలో పాల్గొనవలసిన వారు ప్రస్తుత 2024,25 సంవత్సరంలో 4వ తరగతి చదువుతు తేది 01.09.2015 నుండి 31.08.2016 మధ్యలో జన్మించిన వారు ఉండాలని ఈ ఎంపకలో పాల్గొనే విద్యార్థులు 3వ తరగతి ఉత్తీర్ణత పత్రం, ఆదార్ కార్డు, స్టడి సర్టిఫికేట్ లతో తేది 24న మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలోని మైదంనంలో మండల కో-అర్డినేటర్ సయ్యద్ ఖాజాబికి రిపోర్టు చేయాలని ఈ ఎంపక పోటిలలో ఎంపికైన విద్యార్థులు 27,28 తేదిలలో జిల్లా స్థాయిలో జరిగే పోటిలలో పాల్గొంటారని అమే తెలిపారు.